
జైత్ర
మల్టీ స్పెషాలిటీ
హాస్పిటల్

PRGI NO TGTEL/26/A2948

జ్యోతి
# శ్వేత
JYYOTHI SHWETHA
దినపత్రిక

హైదరాబాద్, విజయవాడ ॥సంపుటి:1 ॥ సంచిక: 57 ॥ శుక్రవారం ॥ 24-7-2026 ॥ పేజీలు: 8 ॥ వెల 3/-



24 జూలై 2026 - శుక్రవారం శ్రీ పరాభవ నామ సంవత్సరం దక్షిణాయనం - గ్రీష్మ ఋతువు ఆషాఢ మాసం - శుక్లపక్షం సూర్యోదయం - తె. 5:56 సూర్యాస్తమయం - సా. 6:48 తిథి దశమి ఉ. 9:13 వరకు తరువాత ఏకాదశి సంస్కృత వారం భృగు వాసరః నక్షత్రం అనురాధ తె. 4:29ం వరకు తరువాత జ్యేష్ఠ యోగం శుక్ల రా. 8:02 వరకు కరణం గరజి ఉ. 9:13 వరకు వనిజ రా. 10:23 వరకు వర్జ్యం ఉ. 6:11 నుండి ఉ. 7:59 వరకు దుర్ముహూర్తం ఉ. 8:31 నుండి ఉ. 9:22 వరకు మ. 12:48 నుండి మ. 1:39 వరకు రాహుకాలం ఉ. 10:46 నుండి మ. 12:22 వరకు యమగండం మ. 3:35 నుండి సా. 5:12 వరకు గుళికాకాలం ఉ. 7:33 నుండి ఉ. 9:09 వరకు బ్రహ్మముహూర్తం తె. 4:20 నుండి తె. 5:08 వరకు అమృత ఘడియలు సా. 4:56 నుండి సా. 6:44 వరకు అభిజిత్ ముహూర్తం ఉ. 11:56 నుండి మ. 12:48 వరకు గమనిక: "ం" అనగా మరుసటి రోజున

## ముఖ్యమంత్రిపై కేటీఆర్ విమర్శలు

### గ్లోబరీనా అంశంపై సవాల్

### విచారణకు సిద్ధమని స్పష్టీకరణ



వరంగల్‌లో గురువారం మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ రాష్ట్ర ప్రభుత్వంపై, ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డిపై తీవ్ర విమర్శలు చేశారు. గ్లోబరీనా సంస్థ అంశంలో తనపై చేసిన ఆరోపణలపై ఇప్పటికే పరువు నష్టం దావాకు సంబంధించి న్యాయపరమైన నోటీసు పంపించినట్లు తెలిపారు.

వరంగల్, జూలై 23: ఆరోపణలను నిరూపించాలని, లేకుంటే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. గ్లోబరీనా సంస్థ నిజంగానే తన బినామీ సంస్థ అయితే, అదే సంస్థతో కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు ఒప్పందాలు చేసుకుందో సమాధానం చెప్పాలని కేటీఆర్ ప్రశ్నించారు. ఒకవైపు ఆ సంస్థతో ఒప్పందాలు చేసుకుని, మరోవైపు దానిని (మిగతా 2వ పేజీలో)



2

## ఓయూ, జేఎన్‌టీయూ పరీక్షలు వాయిదా



## సింగరేణి బలోపేతమే...
# ప్రభుత్వ లక్ష్యం

### సత్తుపల్లి గనిలో భట్టి విక్రమార్క తనిఖీ.. దీర్ఘకాల కార్యాచరణ ప్రణాళికకు ఆదేశాలు



సింగరేణి సంస్థను మరింత బలోపేతం చేసి భవిష్యత్ తరాలకు లాభదాయక ప్రభుత్వ రంగ సంస్థగా అందించడమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. గురువారం సత్తుపల్లి బహిరంగ బొగ్గు గనిని సందర్శించిన ఆయన బొగ్గు నిల్వలు, తవ్వకాల ప్రక్రియ, బొగ్గు నాణ్యతను పరిశీలించి అధికారులతో సమీక్ష నిర్వహించారు.

ఖమ్మం, జూలై 23: అనంతరం విలేకరులతో మాట్లాడుతూ సింగరేణి తెలంగాణ ఆత్మ అని, రాష్ట్ర ప్రజలకు, కార్మికులకు ఈ 130 ఏళ్ల సంస్థతో విడదీయరాని అనుబంధం ఉందని పేర్కొన్నారు. ప్రైవేటు సంస్థల ప్రవేశం, విదేశీ బొగ్గు దిగుమతుల పెరుగుదలతో బొగ్గు రంగంలో పోటీ తీవ్రంగా మారిందని భట్టి విక్రమార్క అన్నారు. ఈ పరిస్థితుల్లో సింగరేణి (మిగతా 2వ పేజీలో)

## 'నేతన్న భరోసా'కు
# ఆమోదం

### నేరడి బ్యారేజ్ నిర్మాణానికి రూ. 641 కోట్ల పరిపాలనా అనుమతి

### 3,168 ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ అంశంపై అధ్యయనానికి ఉపసంఘం

### పుష్కరాల నిర్వహణ, బందోబస్తు కోసం రూ. 50 కోట్లు విడుదల

### కేబినెట్ సమావేశంలో కీలక నిర్ణయాలు

సీఎం చంద్రబాబు నాయుడు అధ్యక్షతన సచివాలయంలో జరిగిన కేబినెట్ సమావేశంలో కీలక నిర్ణయాలకు ఆమోదం లభించిం ది. సుమారు మూడు గంటల పాటు సుదీర్ఘంగా సా గిన ఈ భేటీలో రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమానికి సంబం ధించిన పలు కీలక అంశాలపై చర్చించి ముఖ్యమైన నిర్ణయాలు తీసుకున్నారు.

అమరావతి, జూలై 23: చేనేత కార్మికులకు అండగా నిలిచే 'నేతన్న భరోసా' పథకానికి పచ్చజెండా ఊపిన కేబినెట్, రెండో దశ ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ అంశా న్ని మరింత అధ్యయనం చేసేందుకు మంత్రివర్గ ఉపసంఘానికి అప్పగించింది. సమావేశం అనంతరం కేబినెట్ నిర్ణయాలను తరువాయి 2 వ పేజీలో..

## యువత సమస్యలపై కేంద్రాన్ని ప్రశ్నించిన ఉత్తమ్

### బీజేపీపై మంత్రి తీవ్ర విమర్శలు

### రాహుల్ గాంధీ నాయకత్వాన్ని ప్రశంసించిన మంత్రి

### యువతకు కాంగ్రెస్ అండగా ఉంటుందని స్పష్టం



హైదరాబాద్, జూలై 23 : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం యువత ఆకాంక్షలను నెరవేర్చడంలో పూర్తిగా విఫలమైందని తెలంగాణ నీటిపారుదల, ఆహార, పౌర సరఫరాల శాఖల మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి విమర్శించారు. నిరుద్యోగం, పరీక్షల ప్రశ్నాపత్రాల లీకులు, విద్యార్థుల భవిష్యత్తుపై నెలకొన్న అనిశ్చితి కారణంగా యువతలో తీవ్ర అసంతృప్తి పెరిగిందని (మిగతా 2వ పేజీలో)



## విద్యార్థుల యూనిఫాంలపై
# ఫీడ్‌బ్యాక్ సేకరణ

### వాట్సాప్ ద్వారా అభిప్రాయాలు తీసుకోనున్న ప్రభుత్వం

### నాణ్యత విషయంలో రాజీ లేదన్న ముఖ్యమంత్రి

రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహాల్లో చదువుతున్న విద్యార్థులకు యూనిఫాంలు పంపిణీ చేసిన అనంతరం వాటి నాణ్యత, సైజు, రంగు తదితర అంశాలపై ప్రతి విద్యార్థి నుంచి వాట్సాప్ ద్వారా అభిప్రాయ సేకరణ చేపడతామని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి తెలిపారు.

హైదరాబాద్, జూలై 23: విద్యార్థుల నుంచి వచ్చే సూచనలను పరిగణనలోకి తీసుకుని వచ్చే విద్యా సంవత్సరం నుంచి యూనిఫాంల పంపిణీ విధానం, రంగులు, ఇతర అంశాలపై నిర్ణయం తీసుకుంటామని స్పష్టం చేశారు. ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీలోని బోధి పెవిలియన్‌లో నిర్వహించిన ఉన్నతస్థాయి సమీక్ష (మిగతా 2వ పేజీలో)

# నేడు పండగలా మెగా పీటీఎం 4.0

### విద్యార్థుల సమగ్రాభివృద్ధికి విలువైన వేదిక.. జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ



ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల విద్యా ప్రమాణాల పెంపు, సమగ్రాభివృద్ధి, తల్లిదండ్రులు--ఉపాధ్యాయుల భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ 4.0 కార్యక్రమాన్ని ఈ నెల 24న శుక్రవారం జిల్లా వ్యాప్తంగా పండుగ వాతావరణంలో ఘనంగా నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు.

అమరావతి, జూలై 23: పాఠశాలల్లో నమోదు శాతాన్ని పెంచడం, పదో తరగతి పరీక్షల్లో అత్యుత్తమ ఫలితాలు సాధించడం, విద్యార్థుల వ్యక్తిత్వ వికాసాన్ని పెంపొందించడం వంటివాటికి ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా ఈ సమావేశాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలో 691 ప్రాథమిక, 23 ప్రాథమికోన్నత, 208 ఉన్నత పాఠశాలలతో పాటు 10 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మెగా పీటీఎం నిర్వహించనున్నట్లు తెలిపారు. విద్యార్థులు, తల్లిదండ్రులతో పాటు గౌరవ ప్రజాప్రతినిధులు, దాతలు, పూర్వ విద్యార్థులు కూడా కార్యక్రమంలో పాల్గొంటారన్నారు. ఇందులో ముఖ్యంగా విద్యార్థుల అభ్యసన ఫలితాలను విశ్లేషించడంతో పాటు పాఠశాలలో సౌకర్యాలు, పదో తరగతి ఫలితాలు, తల్లికి వందనం పథకం, షైనింగ్ స్టార్స్, ప్రాథమిక స్థాయిలోని జి-ఎఫ్ఎల్ఎన్ ఫలితాలు తదితర అంశాలు, పథకాలపై వివరించడం జరుగుతుందన్నారు. విద్యతో పాటు క్రీడా సామగ్రి, ఫొటో గ్యాలరీ ప్రదర్శనలు కూడా ఉంటాయని.. తల్లిదండ్రులకు రంగవల్లి, లెమన్ తరువాయి 2 వ పేజీలో...



# సీజేపీ నిరసనలపై హైకోర్టులో పిల్

### విదేశీ నిధులపై దర్యాప్తు కోరిన పిటిషనర్.. శుక్రవారం విచారణ చేపట్టనున్న ధర్మాసనం

నీట్ పేపర్ లీకేజీ వ్యవహారంపై కాక్రోచ్ జనతా పార్టీ చేపట్టిన 'చలో పార్లమెంట్' నిరసనల నేపథ్యంలో ఢిల్లీ హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలైంది. ఈ ఆందోళనల నిర్వహణకు విదేశీ నిధులు అందినట్లు ఆరోపిస్తూ, ఆ అంశంపై జాతీయ దర్యాప్తు సంస్థతో విచారణ జరిపించాలని పిటిషనర్ కోర్టును కోరారు.

న్యూఢిల్లీ, జూలై 23: ఈ ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని సతీశ్ కుమార్ అగర్వాల్ దాఖలు చేయగా, అడ్వకేట్ బారున్ కుమార్ సిన్హా తరఫున వాదనలు వినిపించనున్నారు. ఈ పిటిషన్‌పై శుక్రవారం ప్రధాన న్యాయమూర్తి డీకే ఉపాధ్యాయ, (మిగతా 2వ పేజీలో)

# నేటి రాశి ఫలాలు

మేషం: ఆరోగ్య విషయంలో అశ్రద్ధ చెయ్యడం మంచిది కాదు. మాతృ వర్గ బంధువుల నుండి వివాదాలు కలుగుతాయి. చేపట్టిన పనులలో జాప్యం కలుగుతుంది. నూతన వాహన కొనుగోలు ప్రయత్నాలు వాయిదా పడతాయి. నిరుద్యోగులకు రావలసిన అవకాశములు అందక నిరాశ పెరుగుతుంది. వృత్తి వ్యాపారాలు మందగిస్తాయి.

వృషభం: ఇంటా బయట సంతోషకర వాతావరణం ఉంటుంది. నూతన వస్తు వస్త్ర లాభాలు పొందుతారు. సంతాన విద్యా ఉద్యోగ విషయాలలో ఆశించిన ఫలితాలు పొందుతారు. అన్నివైపుల నుండి ఆదాయం అందుతుంది. వృత్తి ఉద్యోగాలు సంతృప్తికరంగా సాగుతాయి. నూతన వాహన యోగం ఉన్నది.

మిధునం: మానసిక అనారోగ్య సమస్యలు బాధిస్తాయి. కుటుంబ విషయంలో తొందరపాటు ఆలోచనలు ఇబ్బందికి గురిచేస్తాయి. వృత్తి వ్యాపారాలు నిదానంగా సాగుతాయి. ఇతరులతో వివాదాలకు దూరంగా ఉండటం మంచిది. వృధా ఖర్చులు పెరుగుతాయి. చిన్ననాటి మిత్రులతో ఆధ్యాత్మిక,సేవ కార్యక్రమాలలో పాల్గొంటారు.

కర్కాటకం: ముఖ్యమైన పనులు ప్రారంభించి విజయం సాధిస్తారు. కుటుంబ విషయంలో నూతన ఆలోచనలు అమలు చేస్తారు. ఆర్థిక పరిస్థితి ఆశించిన రీతిలో ఉంటుంది. వృత్తి వ్యాపారాలలో ధైర్యంగా నిర్ణయాలు తీసుకుంటారు. నిరుద్యోగులకు నూతన అవకాశములు అందుతాయి. ఉద్యోగుల కష్టం ఫలిస్తుంది.

సింహం: చేపట్టిన పనులలో అవాంతరాలు చికాకు పరుస్తాయి. వృత్తి ఉద్యోగాలలో మీ శ్రమకు తగిన గుర్తింపు లభించదు. ఆర్థిక వ్యవహారాలలో స్వంత ఆలోచనలు కలసిరావు. భాగస్వామ్య వ్యాపారాలు అంతంత మాత్రంగా సాగుతాయి. గృహమున కొందరి ప్రవర్తన ఆశ్చర్యం కలిగిస్తుంది.

కన్య: ఋణ పరమైన సమస్యలు నుండి బయటపడతారు. నూతన కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు. కుటుంబ సభ్యుల సహాయ సహకారాలతో కొన్ని పనులను పూర్తిచేస్తారు. వృత్తి, ఉద్యోగాలలో ఉన్నత పదవులు పొందుతారు. వ్యాపారాలలో అంచనాలను దాటి లాభాలు అందుతాయి.

తుల: బంధు మిత్రులతో గృహమున ఆనందంగా గడుపుతారు. చేపట్టిన పనులలో అవరోధాలు ఉన్నప్పటికీ సకాలంలో పూర్తిచేస్తారు. ఆర్థిక ఇబ్బందులు అధిగమించి దీర్ఘకాలిక ఋణాలు సైతం తీర్చగలుగుతారు. ఉద్యోగాలలో అధికారుల ఆదరణ పెరుగుతుంది. దూర ప్రయాణాలు లాభసాటిగా సాగుతాయి.

వృశ్చికం: ఇంటా బయట మీ మాటకు విలువ పెరుగుతుంది. భవిష్యత్తుకు సంబంధించిన కీలక నిర్ణయాలు తీసుకుంటారు. ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలలో కుటుంబ సభ్యులతో విశేషంగా పాల్గొంటారు. వృత్తి ఉద్యోగాలలో అరుదైన అవకాశములు అందుతాయి. వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి.

ధనస్సు: శారీరక మానసిక ఆరోగ్య సమస్యలు చికాకు పరుస్తాయి. ఇతరులపై మీ ఆలోచనా విధానం మార్చుకోవడం మంచిది. అనుకున్న సమయానికి అనుకున్న విధంగా పనులు పూర్తికావు. బంధు మిత్రులతో చిన్న చిన్న విభేదాలు తప్పవు. వృత్తి ఉద్యోగాలలో అధికారులతో మరింత అప్రమత్తంగా వ్యవహరించాలి.

మకరం: నూతన వస్తు వాహన సౌకర్యాలు పొందుతారు. ధనపరంగా చేసే ప్రయత్నాలు అనుకూలిస్తాయి. బంధు మిత్రుల సమాగమం ఆనందం కలిగిస్తుంది. ఉద్యోగాలలో బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తారు. దూర ప్రయాణ సూచనలున్నవి. చేపట్టిన పనులు సజావుగా సాగుతాయి. నిరుద్యోగ సమస్యలు పరిష్కారమౌతాయి.

కుంభం: ఇంటా బయట మీ మాటకు విలువ పెరుగుతుంది. చేపట్టిన పనులలో జాప్యం కలిగిన నిదానంగా పూర్తిచేస్తారు. కీలక వ్యవహారాలలో సోదరుల సలహాలను తీసుకుని ముందుకు సాగడం మంచిది. సంతానం విషయంలో శుభవార్తలు అందుతాయి. ఉద్యోగ వాతావరణం అనుకూలంగా ఉంటుంది.

మీనం: దీర్ఘకాలిక అనారోగ్య సమస్యలు బాధిస్తాయి. ధన విషయాలలో ఇతరులకు తొందరపడి మాట ఇవ్వడం మంచిది కాదు. వృత్తి వ్యాపారాలలో శ్రమాధిక్యత పెరుగుతుంది. ప్రారంభించిన పనులు మందకొడిగా సాగుతాయి. ఉద్యోగ వాతావరణం సమస్యాత్మకంగా ఉండి శిరో బాధలు పెరుగుతాయి.



# సింగరేణి బలోపేతమే ప్రభుత్వ లక్ష్యం

(మొదటి పేజీ తరువాయి)

అత్యుత్తమ నాణ్యత గల బొగ్గును ఉత్పత్తి చేయడంతో పాటు ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించాలని సూచించారు. గనుల్లో పేలుళ్లు, లోడింగ్ సమయంలో మట్టి, రాళ్లు బొగ్గులో కలవకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు.

నాసిరకం బొగ్గు సరఫరా వల్ల రవాణా వ్యయం పెరగడంతో పాటు ఉష్ణ విద్యుత్ కేంద్రాల పనితీరు దెబ్బతింటుందని, విద్యుత్ ఉత్పత్తిలో అంతరాయాలు ఏర్పడే అవకాశం ఉంటుందని తెలిపారు. విద్యుత్ ఉత్పత్తి సంస్థలకు, ఇతర వినియోగదారులకు నాణ్యమైన బొగ్గునే సరఫరా చేయాలని స్పష్టం చేశారు. ప్రతి లోడింగ్ కేంద్రంలో కంపెనీ అధికారులు కచ్చితమైన పర్యవేక్షణ నిర్వహించాలని సూచించారు. గత పదేళ్లలో కొత్త బొగ్గు గనుల వేలాల్లో పాల్గొనకపోవడం వల్ల సింగరేణి పలు అవకాశాలను కోల్పోయిందని భట్టి విక్రమార్క పేర్కొన్నారు. ఒక బొగ్గు గనిని సొంతం చేసుకున్న తర్వాత భూసేకరణ, అటవీ అనుమతులు, తవ్వకాల ప్రారంభానికి ఏడు నుంచి ఎనిమిది సంవత్సరాలు పడుతుందని, అందువల్ల కనీసం పదేళ్ల దూరదృష్టితో కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్ర భవిష్యత్ విద్యుత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని సింగరేణి, విద్యుత్ ఉత్పత్తి సంస్థలు సంయుక్తంగా దీర్ఘకాల ప్రణాళిక సిద్ధం చేయాలని సూచించారు.

తాడిచెర్ల--2, నైనీ బొగ్గు గనులకు సంబంధించిన భూసేకరణ, అటవీ అనుమతుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించిందని భట్టి విక్రమార్క తెలిపారు. భవిష్యత్తులో దేశవ్యాప్తంగా జరిగే బొగ్గు గనుల వేలాల్లో సింగరేణి పాల్గొనేందుకు ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని చెప్పారు. ప్రపంచవ్యాప్తంగా స్వచ్ఛ ఇంధన వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో సింగరేణి బొగ్గు ఉత్పత్తితో పాటు సౌర విద్యుత్ రంగంలోనూ విస్తరించాలని సూచించారు. సింగరేణికి ఉన్న గనుల అనుభవం, సాంకేతిక నైపుణ్యాన్ని



వినియోగించి సెమీకండక్టర్లు, చిప్ తయారీకి అవసరమైన కీలక ఖనిజాలు, అరుదైన ఖనిజాల అన్వేషణలో కూడా అడుగులు వేయాలని ఉప ముఖ్యమంత్రి సూచించారు. సింగరేణిని ప్రపంచస్థాయి పోటీని తట్టుకునే లాభదాయక సంస్థగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని స్పష్టం చేశారు. ఈ పర్యటనలో ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి నవీన్ మిట్టల్, సింగరేణి చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ బుద్ధ ప్రకాశ్ జ్యోతి, విద్యుత్ ఉత్పత్తి సంస్థ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ హరీష్, సింగరేణి డైరెక్టర్ గౌతమ్ పొత్రు, ఖమ్మం జిల్లా కలెక్టర్ దివాకర్ టి.ఎస్., శాసనసభ్యులు మట్టా రాగమయి, మాలోత్ రాందాస్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# ఫీడ్‌బ్యాక్ సేకరణ

(మొదటి పేజీ తరువాయి)

సమావేశంలో విద్యార్థులకు యూనిఫాంల పంపిణీపై ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహాల్లో చదివే ప్రతి విద్యార్థికి నాణ్యమైన యూనిఫాంలు అందించడంలో ఎలాంటి రాజీ ఉండదని అధికారులకు స్పష్టం చేశారు. ఆగస్టు 15వ తేదీలోగా రాష్ట్రంలోని ప్రతి విద్యార్థికి యూనిఫాంలు అందజేయాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. ఈ ప్రక్రియలో ఎలాంటి ఆలస్యం జరిగినా సహించబోమని హెచ్చరించారు. మహిళా సంఘాలు యూనిఫాంల కుట్టు పనులను వేగవంతం చేసేలా జిల్లా కలెక్టర్లతో సమన్వయం చేసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. గతంలో యూనిఫాంల పంపిణీ వ్యవస్థలో లోపాలు ఉన్నాయని పేర్కొన్న ముఖ్యమంత్రి, ప్రస్తుతం మొత్తం వ్యవస్థను ప్రక్షాళన చేస్తూ నాణ్యమైన యూనిఫాంలు అందించే దిశగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. పేద విద్యార్థుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ప్రతి నిర్ణయం తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. వచ్చే విద్యా సంవత్సరం జూన్ 2వ తేదీ నాటికే విద్యార్థులకు యూనిఫాంలు అందేలా ఇప్పటి నుంచే సమగ్ర కార్యాచరణ రూపొందించాలని ముఖ్యమంత్రి సూచించారు. సమావేశంలో ప్రభుత్వ సలహాదారు పి. సుదర్శన్ రెడ్డి, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సభ్యసాచి ఘోష్, ముఖ్యమంత్రి ప్రధాన కార్యదర్శి ఎన్. శ్రీధర్, ఓఎస్డీ వేముల శ్రీనివాసులు, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రిపై కేటీఆర్ విమర్శలు

(మొదటి పేజీ తరువాయి)

తన బినామీ సంస్థగా ఆరోపించడం సమంజసం కాదన్నారు. తనపై చేస్తున్న ఆరోపణలు పూర్తిగా అవాస్తవమని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించాల్సిన ముఖ్యమంత్రి ఒక్కసారి కూడా ప్రధాని నరేంద్ర మోదీ పేరును ప్రస్తావించరని కేటీఆర్ విమర్శించారు. రాజ్‌భవన్ ముందు ధర్నా చేయాల్సింది పోయి కొడంగల్‌లో ధర్నా చేయడం రాజకీయ నాటకమని ఆరోపించారు. పగలు కాంగ్రెస్‌తో, రాత్రి బీజేపీతో ఉంటూ రెండు పార్టీల మధ్య రాజీ రాజకీయాలు చేస్తున్నారని వ్యాఖ్యానించారు. పాత కేసుల భయం, అమృత్ పథకం, ఇతర కాంట్రాక్టుల ప్రయోజనాల కోసం రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంతో రాజీ పడుతోందని కేటీఆర్ ఆరోపించారు. ముఖ్యమంత్రి మోదీ పేరును ప్రస్తావించడానికి కూడా భయపడుతున్నారని అన్నారు. కాంగ్రెస్‌కు ఒక మూట, బీజేపీకి రెండు మూటలు పంపుతున్న పాలన ఇదేనని విమర్శించారు. గ్లోబరీనా అంశంపై సీఐడీ విచారణకు తాను పూర్తిగా సిద్ధమని కేటీఆర్ స్పష్టం చేశారు. అదే విధంగా ముఖ్యమంత్రి కుటుంబానికి సంబంధించిన అవినీతి ఆరోపణలపై ప్రత్యేక దర్యాప్తు బృందం లేదా సీఐడీతో విచారణకు ప్రభుత్వం సిద్ధమా అని ప్రశ్నించారు. అవసరమైతే అబద్ధ నిర్ధారణ పరీక్షకు కూడా తాను సిద్ధమేనని, ముఖ్యమంత్రి కూడా అందుకు ముందుకు రావాలని సవాల్ విసిరారు. తనపై చేసిన ఆరోపణలకు ప్రభుత్వం స్పష్టమైన ఆధారాలు సమర్పించాలని, లేకపోతే బహిరంగంగా క్షమాపణ చెప్పాలని కేటీఆర్ డిమాండ్ చేశారు.

## ఓయూ, జేఎన్‌టీయూ పరీక్షలు వాయిదా

న్యూఢిల్లీ: ఢిల్లీలో 'ఛలో పార్లమెంట్' సందర్భంగా విద్యార్థులపై లాఠీఛార్జికి నిరసనగా వామపక్ష విద్యార్థి సంఘాలు రాష్ట్ర వ్యాప్తంగా బంద్‌కు పిలుపునివ్వడంతో ఉస్మానియా యూనివర్సిటీ కీలక నిర్ణయం తీసుకుంది. జూలై 24, శుక్రవారం ఓయూ, అనుబంధ కాలేజీల్లో జరగాల్సిన సెమిస్టర్ పరీక్షలను వాయిదా వేసింది. పరీక్షల వాయిదాకు సంబంధించిన సమాచారాన్ని అనుబంధ కళాశాలలకు తెలిపింది. విద్యార్థి సంఘాల రాష్ట్ర వ్యాప్త బంద్ నేపథ్యంలో శుక్రవారం నాటి ఎగ్జామ్స్ గురించి విద్యార్థులు ఆందోళన చెందవద్దని.. వాయిదా పడిన పరీక్షలకు కొత్త తేదీని త్వరలోనే ప్రకటిస్తామని ఓయూ అధికారులు వెల్లడించారు. అటు.. జేఎన్‌టీయూలో సైతం శుక్రవారం జరగాల్సిన పరీక్షలు వాయిదా పడ్డాయి. ఈ విషయాన్ని గురువారం జేఎన్‌టీయూ యాజమ్యాన్యం వెల్లడించింది. తెలంగాణ యూనివర్సిటీ, మహాత్మ గాంధీ యూనివర్సిటీ లోనూ పరీక్షలను వాయిదా వేశారు. శుక్రవారం జరగాల్సిన పరీక్షలకు త్వరలోనే కొత్త తేదీలు ప్రకటిస్తామని అనుబంధ కాలేజీలకు టీయూ అధికారులు సమాచారమిచ్చారు. శుక్రవారం నాటి బంద్ ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్, ఎన్ఎస్‌యూఐ, పీడీఎస్‌యూ, ఏఐఎఫ్‌డీఎస్, ఏఐపీఎస్‌యూ, ఏఐఎస్‌బీల ఆధ్వర్యంలో జరగనుంది. బంద్‌లో భాగంగా శుక్రవారం ఉదయం 11:00 గంటల నుండి నారాయణ గూడ చౌరస్తా నుండి వై జంక్షన్ వరకు " విద్యార్థి ర్యాలీ " నిర్వహించనున్నారు.

# కేంద్రాన్ని ప్రశ్నించిన ఉత్తమ్

(మొదటి పేజీ తరువాయి)

పేర్కొన్నారు. ఈ పరిస్థితుల్లో కేంద్ర ప్రభుత్వానికి యువతతో దూరం పెరుగుతోందని అన్నారు. యువత, విద్యార్థులు తమ హక్కుల కోసం ప్రజాస్వామ్యబద్ధంగా నిరసనలు చేపడితే వారి సమస్యలను పరిష్కరించాల్సిన ప్రభుత్వం అణచివేతకు పాల్పడుతోందని ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆరోపించారు. ప్రశ్నించే స్వరాలను అరెస్టులు, బెదిరింపులతో అణచివేయాలని చూడడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని వ్యాఖ్యానించారు.

ఇలాంటి పరిస్థితుల్లో భారత జాతీయ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ యువతకు అండగా నిలుస్తూ వారి సమస్యలపై నిరంతరం గళమెత్తుతున్నారని మంత్రి పేర్కొన్నారు. రాజ్యాంగ పరిరక్షణ, ప్రజాస్వామ్య విలువల పరిరక్షణ కోసం ఆయన రాజీలేని పోరాటం చేస్తున్నారని, యువత ఆశయాలకు ప్రతినిధిగా నిలుస్తున్నారని అన్నారు. రాహుల్ గాంధీ రాజకీయాలు ప్రేమ, న్యాయం, సమానత్వం, రాజ్యాంగ విలువలపై ఆధారపడి ఉన్నాయని ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. అందువల్ల దేశ యువత, మేధావులు, మధ్యతరగతి ప్రజల్లో ఆయనపై విశ్వాసం రోజురోజుకూ పెరుగుతోందని పేర్కొన్నారు. దేశానికి ప్రత్యామ్నాయ నాయకత్వంగా రాహుల్ గాంధీ ఎదుగుతున్నారని అభిప్రాయపడ్డారు.

తెలంగాణలో ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమం, రైతు సంక్షేమం, యువత ఉపాధి, సామాజిక న్యాయానికి అత్యున్నత ప్రాధాన్యం ఇస్తోందని మంత్రి తెలిపారు. ప్రజల సమస్యల పరిష్కారమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. దేశ యువత భయపడకుండా తమ హక్కులు, భవిష్యత్తు, రాజ్యాంగ పరిరక్షణ కోసం ప్రజాస్వామ్యబద్ధంగా ముందుకు సాగాలని ఉత్తమ్ కుమార్ రెడ్డి పిలుపునిచ్చారు. యువతకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని, దేశంలో ప్రజాస్వామ్య విలువలను బలోపేతం చేసే దిశగా పార్టీ తన పోరాటాన్ని కొనసాగిస్తుందని స్పష్టం చేశారు.

# సీజేపీ నిరసనలపై హైకోర్టులో పిల్

(మొదటి పేజీ తరువాయి)

న్యాయమూర్తి తేజస్ కరియాతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టనున్నట్లు సమాచారం. 'చలో పార్లమెంట్' నిరసనల కారణంగా దేశ రాజధాని ఢిల్లీలో సాధారణ జనజీవనం తీవ్రంగా ప్రభావితమైందని పిటిషన్‌లో పేర్కొన్నారు. నీట్ పేపర్ లీకేజీ అంశంతో ప్రారంభమైన ఉద్యమం తరువాత రాజకీయ మలుపు తిరిగిందని, వివిధ రాజకీయ పార్టీల నాయకులు కూడా ఈ ఆందోళనల్లో పాల్గొన్నారని ఆరోపించారు.

ఈ నిరసనలకు సామాజిక కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్ మద్దతు తెలిపారని, ఆయనకు విదేశీ సంస్థలతో సంబంధాలు ఉన్నాయని కూడా పిటిషన్‌లో ప్రస్తావించారు. ఈ అంశాలపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని కోర్టును కోరారు. అయితే పిటిషన్‌లో చేసిన ఆరోపణలు ప్రస్తుతం కోర్టు పరిశీలనలో ఉన్నాయని, వాటిపై ఇంకా ఎలాంటి న్యాయపరమైన నిర్ధారణ వెలువడలేదని గమనించాల్సి ఉంది. ఈ ఆరోపణలపై సంబంధిత పక్షాల వాదనలు, కోర్టు విచారణ అనంతరం తదుపరి పరిణామాలు స్పష్టమయ్యే అవకాశం ఉంది. శుక్రవారం జరగనున్న విచారణలో పిటిషనర్ వాదనలు, సంబంధిత పక్షాల అభిప్రాయాలను విన్న అనంతరం ఢిల్లీ హైకోర్టు తదుపరి ఆదేశాలు జారీ చేసే అవకాశం ఉంది. ఈ వ్యవహారం దేశవ్యాప్తంగా ఆసక్తిని రేకెత్తిస్తోంది.

# నేడు పండగలా మెగా పీటీఎం 4.0

(మొదటి పేజీ తరువాయి)

అండ్ స్పూన్, మ్యూజికల్ ఛైర్స్, టగ్ ఆఫ్ వార్ వంటి పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. లీప్ యాప్ ప్రదర్శనతో పాటు ముఖ్య అతిథులు ప్రసంగాలు, ప్రశ్నోత్తరాలు, సాంస్కృతిక కార్యక్రమాలు కూడా ఉంటాయని వివరించారు. కార్యక్రమంలో భాగంగా డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం కింద సిద్ధం చేసిన ఆహారాన్ని విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులు, అతిథులు రుచిచూస్తారని తెలిపారు. చిన్నారుల బంగారు భవిష్యత్తు కోసం నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో అందరూ పాల్గొని విజయవంతం చేయాలని కలెక్టర్ లక్ష్మీశ కోరారు. జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ ఆదేశాల మేరకు డీఈవో ఎల్.చంద్రకళ, అడిషనల్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ ఆర్.రమేష్‌బాబు.. పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో వర్చువల్ సమావేశం నిర్వహించారు. కార్యక్రమాన్ని సజావుగా నిర్వహించేందుకు సూచనలు చేశారు. కార్యక్రమంలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, గ్రామస్తులు, గౌరవ ప్రజాప్రతినిధులను భాగస్వామ్యం చేసి విజయవంతం చేయాలని సూచించారు.

# 'నేతన్న భరోసా'కు ఆమోదం

(మొదటి పేజీ తరువాయి)

సమాచార, పౌరసంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి మీడియాకు వెల్లడించారు. రాష్ట్రంలోని చేనేత కార్మికుల సంక్షేమం కోసం 'నేతన్న భరోసా' (నేతన్నల సేవలో) పథకం అమలుకు మంత్రివర్గం ఆమోదముద్ర వేసింది. ఈ పథకం కింద 50 ఏళ్లలోపు వయస్సు ఉండి, దారిద్ర్యరేఖకు దిగువన (బీపీఎల్) ఉన్న చేనేత కుటుంబాలకు ఏటా రూ.25,000 చొప్పున ఆర్థిక సహాయం అందించనున్నారు. ఇక రాష్ట్రంలో రెండో దశ కింద 3,168 ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ అంశంపై మరింత లోతుగా అధ్యయనం చేసి నివేదిక సమర్పించాలని సీఎం ఆదేశాల మేరకు మంత్రివర్గ ఉపసంఘాన్ని ఏర్పాటు చేశారు. ఉపసంఘం నివేదిక అందిన తర్వాత తదుపరి కేబినెట్ సమావేశంలో ఉద్యోగాల భర్తీపై తుది నిర్ణయం తీసుకోనున్నారు. రాష్ట్రంలో మౌలిక వసతులు, నీటిపారుదల ప్రాజెక్టులను వేగవంతం చేసేందుకు కేబినెట్ పలు పరిపాలనా అనుమతులు మంజూరు చేసింది. ఇందులో భాగంగా నేరడి బ్యారేజ్ నిర్మాణానికి రూ.641.10 కోట్లు, హెచ్ఎన్ఎస్ఎస్ ఫేజ్-2 పనుల పెరిగిన అంచనా వ్యయం రూ.312 కోట్లకు ఆమోదం తెలిపారు. అలాగే రాబోయే గోదావరి పుష్కరాల సమర్థ నిర్వహణ, భద్రత, బందోబస్తు ఏర్పాట్ల కోసం రూ.50 కోట్ల నిధులను కేబినెట్ మంజూరు చేసింది. వీటితో పాటు భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం పనుల పురోగతిపై సుదీర్ఘంగా చర్చించారు. విద్యా రంగానికి సంబంధించి వెదుళ్లపల్లిలో వినికిడి లోపం ఉన్న విద్యార్థుల కోసం ప్రత్యేకంగా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటుకు కేబినెట్ అంగీకరించింది.

# శ్వేత సంపాదకీయం

**శుక్రవారం 24-7-2026**

## యువత ఆక్రోశానికి.. సమాధానమేదీ?

పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు సోమవారం ప్రారంభం అయ్యాయి. వరుసగా నాలుగోరోజు కూడా ఉభయ సభల్లో గందరగోళం నెలకొంది. సమావేశాలు సజావుగా సాగడం లేదు. నీట్ లీకేజీపై ధర్మేంధ్ర ప్రధాన్ రాజీనామా చేయాలన్న డిమాండ్‌తో కాక్రోచ్ జనతాపార్టీ ఆందోళనలకు దిగింది. నీట్ లీకేజీకి బాధ్యతగా కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలన్న డిమాండ్‌తో సంసద్ చలో ఆందోళనకు పిలుపునిచ్చింది. వారి ఆందోళనలో వందశాతం న్యాయం ఉంది. ఎందుకంటే పరీక్షలను కూడా సక్రమంగా నిర్వహించలేని అసమర్థులు...పాలకులు అయినప్పుడు ప్రజలు స్పందిస్తారు. నిలదీస్తారు. నీట్ పరీక్ష వల్ల జరిగిన గందరోగళం ఎందరినో బలితీసుకుంది. ఎందరో తల్లిదండ్రులు క్షోభకు గురయ్యారు. దీనిని ఓ చిన్న సమస్యగా ప్రభుత్వం భావించి ఉండవచ్చు. కానీ విద్యార్థులకు మాత్రం ఇది జీవన్మరణ సమస్య. ఇకపోతే నాలుగు రోజులుగా గందరగోళం జరుగుతున్నా ప్రధాని మోడీ మౌనం వీడడం లేదు. కేవలం ఎక్స్ వేదికగా కఠినంగా వ్యవహరిస్తామని, నీట్ దోషుల కోసం ఫాస్ట్ ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేస్తామని ప్రకటించి చేతులు దులుపుకున్నారు. దేశంలో ఓ పెద్ద ఆందోళన జరుగుతంటే ఇదేనా ప్రధానిగా ఉన్న వ్యక్తి చేయాల్సిన పని. మణిపూర్ అల్లర్లు, ఢిల్లీలో రైతుల ఆందోళన, నీట్ పరీక్షా పేపర్ లీకేజీ, అయోధ్య విరాళాల చోరీ..ఇటీవల వరుసగా జరిగిన సంఘటనలు దేశాన్ని కుదిపేస్తున్నాయి. వీటిపై పార్లమెంటులో చర్చించడం జరగాలి. ప్రధాని మోడీ మౌనం వీడి పార్లమెంట్‌కు వచ్చి, నేరుగా సమాధానం చెప్పాల్సిన ముఖ్యమైన అంశాలు. దివంగత ప్రధాని మన్మోహన్ సింగ్‌ను మౌనమునిగా విమర్శించిన మోడీ ఇప్పుడు అంతకు మించి మౌనంగా మారారు. పార్లమెంట్ జరుగుతన్నా రాకుండా చోద్యం చూస్తూ ఎక్స్‌లో పోస్టులు పెట్టడం సరికాదు. ఇక్కడ సమాధానం చెప్పడం అంటే దేశప్రజలకు సమాధానం చేరవేయడంగా గుర్తించాలి. బాధ్యతగల ప్రధానిగా మోడీ పార్లమెంట్‌కు వచ్చి సమాధానం ఇవ్వాలి. కానీ అలా జరగడం లేదు. ఇంతకన్నా దౌర్భాగ్యం మరోటి లేదు. ఆయన వందిమాగధులు ఇదంతా విపక్షాలతో తమకున్న పంచాయితీలాగా సవాళ్లు విసరుతున్నారు. దేశం తీవ్ర ఆందోళనలో ఉంటే ఇదేనా పాలక పార్టీ వ్యవహరించే తీరు. ఇకపోతే దేశంలోని వ్యవస్థల్లో అవినీతి పాతుకుపోయిందనడానికి నీట్ పేపర్ లీకేజీ వంటివి పరాకాష్టగా చూడాలి. అవినీతి అన్నది రాజకీయ నాయకుల హక్కుగా మారింది. ప్రజలను ఏమార్చి, అధికారం చేపట్టగానే, ఓటు బ్యాంకు రాజకీయాలు తప్ప దేశహితం, దేశాన్ని ముందుకు తీసుకుని వెళ్లేందుకు అసవరమైన నిర్ణయాలు తక్కువే జరుగుతున్నాయి. ఇటీవల రామమందిరంలో విరాళాల చోరీ ఘటన తెలిసిందే. అవినీతి కేసుల్లో దోషులకు మరణశిక్ష విధించాలి.

అవినీతి సాధారణమేనని సగటు భారత పౌరులు ఆలోచించే పరిస్థితి నెలకొన్నది. దొరికే వరకు కూడా ఇది తప్పు అని కూడా భావించడంలేదు. వ్యవస్థలో అవినీతిని రూపుమాపాలని ప్రభుత్వం నిజంగా భావిస్తే, చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాలి. చట్టాన్ని సవరించాలి. దోషులకు మరణ శిక్ష విధించేలా మార్పులు చేయాలి. ఉన్న చట్టాలతోనే కఠిన శిక్షలు విధించాలి. ఇకపోతే దేశంలో విద్యా వ్యవస్థ తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయిందనడంలో ఎలాంటి సందేహం అక్కర్లేదు. గత పదేళ్లలో ఏకంగా 152 పోటీ పరీక్షల ప్రశ్నాపత్రాలు లీక్ అయ్యాయని లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ ఆరోపించారు. సగటున నెలకు ఒక పేపర్ లీక్ అవుతున్నా బాధ్యులైన వారికి పడిన శిక్షలు మాత్రం సున్నా అని ధ్వజమెత్తారు. నిజంగానే ఇది ముమ్మాటికీ నిజం. నీట్ ప్రశ్నాపత్రాల లీకేజీకి నిరసనగా శాంతియుతంగా ఆందోళన చేస్తున్న విద్యార్థులపై పోలీసులు లాఠీఛార్జ్ చేయడానికి ముందే ప్రధాని మోడీ పార్లమెంటులో స్పందించి ఉంటే ఈ గందరగోళం చెలరేగేది కాదు. ప్రతి ఆందోళనను రాజకీయ కోణంలో చూడడం, విపక్షాలను తిట్టిపోయడం వల్ల సమస్యలను పాలకులు గుర్తించడం లేదు. ఒకప్పుడు ప్రపంచానికే ఆదర్శంగా నిలిచిన భారత విద్యా వ్యవస్థ.. అక్రమాలు, లీకేజీలకు నిలయంగా మారింది. దేశంలో పేపర్ లీకేజీలు ఒక పెద్ద మాఫియాగా మారాయి. దీని వెనుక ఉన్న బడాబాబులపై ప్రభుత్వం చర్యలు తీసుకోవడంలో విఫలం అవుతూ వస్తోంది. జంతర్ మంతర్ వద్ద భారతీయ యువత నిరసనలను సీరియస్‌గా తీసుకోవాల్సి ఉండగా, దానిని అణచివేయడం ఎలా అన్న ఆలోచననే అధికారపక్షం ఆలోచన చేయడం సరికాదు. నిరసనల్లో లక్ష మందికి పైగా యువకులు, విద్యార్థులు పాల్గొని ఉంటారని ఫోటోలు స్పష్టంగా సూచిస్తున్నాయి. తొలుత ఒక మార్చ్‌గా అనుకున్నది తరువాత నిరసన ప్రదర్శనగా పరిణమించింది. ఎంతోకాలంగా ఆగ్రహంతో ఉన్న యువత ఈ అవకాశాన్ని అనుకూలంగా తీసుకుని, వెల్లువెత్తి జనసంద్రంగా మారినట్లు మనకు కనిపిస్తోంది. మన దేశంలో రాజకీయ పార్టీల ర్యాలీలకు డబ్బులు, ఇతర ప్రలోభాలతో జనాన్ని సమీకరించడం పరిపాటి. అయితే ఈ నిరసన ప్రదర్శన అలా జరగలేదు. జంతర్ మంతర్‌కు చేరిన వారందరూ తమకు తాముగా స్వచ్ఛందంగా వచ్చినవారే. ప్రతి ఒక్కరూ సామాజిక మాధ్యమాలలో విజ్ఞప్తులకు ప్రతిస్పందించి స్వచ్ఛందంగా వచ్చినవారే. ఎవరి ప్రయాణ ఏర్పాట్లు వారే చేసుకుని, సుదూర ప్రాంతాల నుంచి నడిచి వచ్చినవారు చాలామంది ఉన్నారు. ఇంకో ముఖ్య విషయమేమంటే వచ్చిన వారిలో యువ మహిళల శాతం అత్యధికంగా ఉండడం. ఈ నిరసన ప్రదర్శనలో పాల్గొన్నవారిలో అత్యధికులు ఇటువంటి నిరసనలలో తొలిసారి పాల్గొన్నవారే కావడం మరో వాస్తవం. కేవలం నీట్ తదితర ప్రశ్నపత్రాల లీక్‌కు రగిలిపోయి మాత్రమే యువత జంతర్ మంతర్ వద్ద ధర్నాకు రాలేదని ఖచ్చితంగా చెప్పవచ్చు.

దేశంలో పెచ్చరిల్లు తోన్న నిరుద్యోగం, అవినీతిమయమైన అధికార వ్యవస్థలు, రాజకీయ పార్టీల కపటాలు అన్నీ కలగలిపి వారిని ఈ నిరసనలో పాల్గొనేలా ప్రోత్సహించాయనే చెప్పాలి. విద్యాభ్యాసాన్ని పూర్తిచేసుకుని ఉద్యోగాలను వెతుక్కుంటున్న వారు, నియామకాలలో అవకతవకలకు బాధితులైనవారు ఎందరో ఆ నిరసనకారుల్లో ఉన్నారని చెప్పక తప్పదు. దేశ పాలనావ్యవస్థల్లో అవినీతి మితిమీరి, రాజకీయ అవినీతి పెరిగి పోవడం, పాలకుల విలాసాలు, ప్రజలేమో అవస్థల పాలవుతున్న తీరు కారణంగా యువత నిరసనలకు ఉద్యమించిందని చెప్పక తప్పదు. దీనికి విదేశీ హస్తం ఉందనో లేదా మరే ఇతర కారణాలనో చూపి మసిపూసి మారేడుకాయ చేసే ప్రయత్నాలు కూడా మంచిది కాదు. సమస్యలను గుర్తించి పాలకలు తమ తీరును మార్చుకోవాలి. ఇది కేంద్ర రాష్ట్రాల పాలకలుకు ఓ హెచ్చరిక కావాలి. అలాగే ఈ యువ నిరసన ఒక ఆరంభం మాత్రమే. ఇది దావానలంలా విస్తరించినా ఆశ్చర్య పోనవసరం లేదు. పాలకులు బుద్ధి తెచ్చుకుని మారకపోతే యువత చరిత్ర సృష్టిస్తుందని చెప్పక తప్పదు.

# నేడు తెలంగాణలో విద్యాసంస్థల బంద్

**నీట్ పేపర్ లీకేజీకి నిరసనగా విద్యార్థి సంఘాల పిలుపు.. బంద్ నేపథ్యంలో నేటి ఓయూ పరీక్షలు వాయిదా**

హైదరాబాద్, జూలై 23: నీట్ ప్రశ్నపత్రాల లీకేజీకి కేంద్ర ప్రభుత్వమే నైతిక బాధ్యత వహించాలని డిమాండ్ చేస్తూ నేడు తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా విద్యాసంస్థల బంద్‌కు పలు విద్యార్థి సంఘాలు పిలుపునిచ్చాయి. దేశవ్యాప్తంగా కలకలం రేపిన నీట్ పేపర్ లీకేజీ దోషులను కఠినంగా శిక్షించడంతో పాటు, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని ఎన్ఎస్‌యూఐ, ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ, పీడీఎస్‌యూ, ఏఐఎఫ్‌డీఎస్, ఏఐఎస్‌బీ, ఏఐపీఎస్‌యూ తదితర సంఘాలు డిమాండ్ చేశాయి. ప్రవేశ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించడంలో పూర్తిగా విఫలమై, ప్రశ్నాపత్రాల లీకేజీకి కారణమైన నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీని వెంటనే రద్దు చేయాలని విద్యార్థి నేతలు ముక్తకంఠంతో స్పష్టం చేశారు. నీట్ అభ్యర్థులకు న్యాయం చేయాలని కోరుతూ గత కొద్ది రోజులుగా ఢిల్లీలో శాంతియుతంగా ఆందోళన చేస్తున్న విద్యార్థులపై జరిగిన పోలీసు లాఠీచార్జ్‌ను విద్యార్థి సంఘాల నాయకులు తీవ్రంగా ఖండించారు. లాఠీచార్జ్‌కు బాధ్యులైన పోలీసు అధికారులపై చర్యలు తీసుకోవాలని, అలాగే విద్యార్థులపై అక్రమంగా బనాయించిన కేసులను వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. తమ డిమాండ్లు నెరవేరేలా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చేందుకు విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, మేధావులు ఈ బంద్‌కు పూర్తి మద్దతు తెలపాలని సంఘాలు విజ్ఞప్తి చేశాయి. నేడు జరిగే బంద్‌లో ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల యాజమాన్యాలన్నీ స్వచ్ఛందంగా పాల్గొని సంస్థలను మూసివేయాలని, లేనిపక్షంలో తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించాయి.

### ఉస్మానియా యూనివర్సిటీ పరీక్షలు వాయిదా

విద్యార్థి సంఘాల రాష్ట్రవ్యాప్త బంద్ పిలుపు నేపథ్యంలో ఉస్మానియా యూనివర్సిటీ అధికారులు ముందుజాగ్రత్త చర్యగా కీలక నిర్ణయం తీసుకున్నారు. వర్సిటీ పరిధిలో జరగాల్సిన డిగ్రీ, పీజీ పరీక్షలన్నింటినీ వాయిదా వేస్తున్నట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ అధికారికంగా ప్రకటించారు. వాయిదా పడిన ఈ పరీక్షల తేదీలను త్వరలోనే వెల్లడిస్తామని స్పష్టం చేశారు.



# భూ మోసాలకు ‘బ్లాక్‌చెయిన్’తో చెక్!

**ట్యాంపర్ ప్రూఫ్ విధానానికి శ్రీకారం చుట్టిన సీఎం చంద్రబాబు**

**మొదటి దశలో 7 జిల్లాల్లోని 7 మండలాల్లో పైలట్ ప్రాజెక్టు**

**భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపడమే లక్ష్యం**

**నవంబర్ నుంచి రాష్ట్రవ్యాప్తంగా అమలు**

అమరావతి, జూలై 23: ఆంధ్రప్రదేశ్‌లో భూ రికార్డుల నిర్వహణలో విప్లవాత్మక మార్పులకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. భూ లావాదేవీల్లో పారదర్శకతను పెంచి, మోసాలకు అడ్డుకట్ట వేసేందుకు రూపొందించిన ‘మీ భూమి-బ్లాక్‌చెయిన్’ పైలట్ ప్రాజెక్టును ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గురువారం సచివాలయం నుంచి వర్చువల్‌గా ప్రారంభించారు. భూ రికార్డులకు శాశ్వత భద్రత కల్పించడమే లక్ష్యంగా రెవెన్యూ శాఖ ఈ అత్యాధునిక టెక్నాలజీకి రూపకల్పన చేసింది. ఈ ట్యాంపర్ ప్రూఫ్ విధానం ద్వారా డబుల్ రిజిస్ట్రేషన్ల వంటి సమస్యలకు శాశ్వతంగా చెక్ పెట్టవచ్చని ప్రభుత్వం భావిస్తోంది.

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ, సరైన రికార్డులు లేకపోవడం వల్లే విలువైన భూముల విషయంలో మోసాలు, భూ వివాదాలు తలెత్తుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వ విధానాల వల్ల రాష్ట్రంలో భూ తగాదాలు పెరిగాయని, 22ఏ నిబంధనను అడ్డుపెట్టుకుని కక్ష సాధింపులకు పాల్పడ్డారని ఆరోపించారు. తమ ప్రభుత్వం ‘ప్రక్షాళన, విముక్తి, భద్రత’ అనే మూడు సూత్రాల ఆధారంగా భూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తోందన్నారు. శెట్టిపల్లి, వట్టిచెరుకూరు వంటి గ్రామాల్లో దశాబ్దాలుగా నలుగుతున్న భూ వివాదాలకు పరిష్కారం చూపిన విషయాన్ని గుర్తుచేస్తూ, ఇప్పుడు ప్రారంభించిన బ్లాక్‌చెయిన్ వ్యవస్థ ద్వారా భూములకు సంపూర్ణ భద్రత లభిస్తుందని స్పష్టం చేశారు.

ఈ ప్రాజెక్టును ఎన్ఐసీ ఆంధ్రప్రదేశ్, బెంగళూరులోని ‘ఎన్ఐసీ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఇన్ బ్లాక్‌చెయిన్ టెక్నాలజీ’ సంస్థలు సంయుక్తంగా ‘హైపర్ లెడ్జర్ ఫ్యాబ్రిక్’ సాంకేతికతతో అభివృద్ధి చేశాయి. ఈ విధానంలో ప్రతి భూ కమతానికి ఒక ప్రత్యేక డిజిటల్ ఐడీని కేటాయించి, లావాదేవీలను అత్యంత భద్రంగా నమోదు చేస్తారు. దీనివల్ల రెవెన్యూ, సర్వే, రిజిస్ట్రేషన్ శాఖలు ఒకే వేదికపైకి వచ్చి, భూ రికార్డులకు ‘సింగిల్ సోర్స్ ఆఫ్ ట్రూత్’ వ్యవస్థ ఏర్పడుతుందని, ప్రజలు ఎలాంటి ఇబ్బందులు లేకుండా క్రయవిక్రయాలు జరుపుకోవచ్చని తెలిపారు.

పైలట్ ప్రాజెక్టు కింద తొలి దశలో కర్నూలు, చిత్తూరు, బాపట్ల, కృష్ణా, తూర్పు గోదావరి, పార్వతీపురం మన్యం, విజయనగరం జిల్లాల్లోని ఆస్పరి, పెనుమూరు, రేపల్లె, గన్నవరం, కడియం, గుమ్మలక్ష్మీపురం, కొత్తవలస మండలాలను ఎంపిక చేశారు. ఈ 7 మండలాల్లోని 89 రీ-సర్వే గ్రామాల్లో ఉన్న 1,37,763 ల్యాండ్ పార్సెల్స్ ప్రస్తుతం ఈ ప్రాజెక్టు పరిధిలోకి రానున్నాయి.

ఈ పైలట్ ప్రాజెక్టు అమలును రాబోయే రెండు నెలల పాటు క్షుణ్ణంగా అధ్యయనం చేయాలని, ప్రజల ఫిర్యాదుల స్వీకరణకు ప్రత్యేక కంప్లైంట్ సెల్ ఏర్పాటు చేయాలని అధికారులను సీఎం ఆదేశించారు. ప్రజల ఫీడ్‌బ్యాక్ ఆధారంగా మార్పులు చేసి, నవంబర్ నుంచి రాష్ట్రవ్యాప్తంగా ఈ విధానాన్ని అందుబాటులోకి తీసుకురావాలని లక్ష్యంగా నిర్దేశించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్, సీఎస్ సాయి ప్రసాద్, ఉన్నతాధికారులు మరియు కలెక్టర్లు పాల్గొన్నారు.





# పేపర్ లీక్‌లపై ఫాస్ట్‌ట్రాక్ కోర్టులు

**ప్రధాని కీలక ప్రకటన!**

**యువత భవిష్యత్తుతో ఆడుకుంటే సహించేది లేదన్న మోదీ**

**రాహుల్ గాంధీ, సీజేపీ తీవ్ర స్పందన..**

**ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాకే పట్టు**

న్యూఢిల్లీ, జులై 23: నీట్ పేపర్ లీక్‌కు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ దిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద మొదలైన ఆందోళనలు దేశవ్యాప్తంగా తీవ్రరూపం దాల్చుతున్నాయి. కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) ఆధ్వర్యంలో ప్రారంభమైన ఈ నిరసనలకు విపక్షాలు కూడా తోడవడంతో పార్లమెంట్‌లోనూ పేపర్ లీకేజీ వ్యవహారంపై వాయిదాల పర్వం కొనసాగుతోంది. ఈ వరుస పరిణామాల వేళ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గురువారం ఒక కీలక ప్రకటన చేశారు. పరీక్ష పత్రాల లీకేజీకి పాల్పడిన బాధ్యులకు త్వరితగతిన కఠిన శిక్ష పడేలా చూసేందుకు ప్రభుత్వం ప్రత్యేకంగా ‘ఫాస్ట్‌ట్రాక్ కోర్టులను’ ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. విద్యార్థుల ప్రయోజనాలను పరిరక్షించడమే తమ ప్రభుత్వానికి ప్రథమ ప్రాధాన్యమని, యువత భవిష్యత్తుకు హాని తలపెట్టాలని చూసేవారిని ఎట్టి పరిస్థితుల్లోనూ వదిలిపెట్టబోమని ప్రధాని మోదీ ‘ఎక్స్’ వేదికగా స్పష్టం చేశారు. అలాగే విద్యార్థుల నిరసనలను ప్రతిపక్షాలు స్వార్థ రాజకీయాలకు వాడుకోవద్దని బిజెపి అధ్యక్షుడు జేపీ నడ్డా పేర్కొన్నారు.

మరోవైపు ప్రధాని మోదీ ప్రకటనపై లోక్‌సభలో విపక్ష నేత, కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. దేశ యువత భవిష్యత్తుకు హాని చేసింది ప్రధాని మోదీయేనని, విద్యావ్యవస్థ నిర్వీర్యమవుతుంటే చూస్తూ బాధ్యులైన వారిని రక్షించారని ఆరోపించారు. ఈ సందర్భంగా రాహుల్ గాంధీ కేంద్రం ముందు మూడు ప్రధాన డిమాండ్లను ఉంచారు. 1. విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను వెంటనే పదవి నుంచి తొలగించాలి, 2. విద్యార్థులకు క్షమాపణ చెప్పాలి, 3. ఆందోళన చేస్తున్న యువతపై దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. అటు సీజేపీ కూడా ఫాస్ట్‌ట్రాక్ కోర్టుల ప్రకటనపై స్పందిస్తూ.. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాల్సిందేనని తన డిమాండ్‌ను పునరుద్ఘాటించింది. ఇదిలా ఉండగా, తీవ్రమవుతున్న సీజేపీ ఆందోళనల నేపథ్యంలో భద్రతా చర్యల్లో భాగంగా గురువారం కూడా దిల్లీలో 16 కీలక మెట్రో స్టేషన్లను అధికారులు మూసివేశారు.

# సకాలంలో సభ్యత్వాలు పూర్తి చేయాలి: డీడీఎం రవీందర్




**చిలుకూరు, జూలై 23**

నాబార్డ్ సహకారంతో, ఇంటి గ్రేటెడ్ రూరల్ డెవలప్మెంట్ సొసైటీ (ఐఆర్డీఎస్) సమన్వ యంలో చిలుకూరు మండల కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న భానుపురి డైరీ రైతు ఉత్పత్తిదారుల మ్యాక్స్ లిమిటెడ్ డైరెక్టర్ల సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సమావేశా నికి నాబార్డ్ సూర్యాపేట జిల్లా అభివృద్ధి మేనేజర్ (డీడీఎం) రవీందర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ, డైరీ అభివృద్ధి కోసం రైతుల నుంచి సభ్య త్వాలను సకాలంలో పూర్తి చేయాలని డైరెక్టర్లకు సూచించారు. సభ్యత్వ నమోదు ప్రక్రియను వేగవంతం చేయ డం ద్వారా నాబార్డ్ నుంచి లభించే ఆర్థిక సహాయాన్ని సమర్థవంతంగా వినియోగిం చి డైరీ అభివృద్ధికి కృషి చేయాలని అన్నారు. డైరీ సంస్థ బలోపేతంలో డైరెక్టర్లు కీలక పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. త్వరలోనే స్థానిక ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి చేతుల మీదుగా డైరీ కార్యాలయ ప్రారంభోత్సవాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. సమావేశంలో ఐఆర్డీఎస్ నిర్వాహకులు రమేష్, సీఈవో అఖిల్, తాత్కాలిక చైర్మన్ కొడారు రాము, డైరెక్టర్లు నెల్లూరి నాగేశ్వరరావు, పులగం ప్రభాకర్, కందుకూరి కృష్ణమూర్తి, కొడారు రాంబాబు, ఉబ్బపల్లి మంగమ్మ, మాతంగి వీరస్వామి తదితరులు, రైతులు పాల్గొన్నారు.



## ఎన్టీఆర్ జిల్లాను ఐటీ హబ్‌గా తీర్చిదిద్దేందుకు భవన యజమానులు
# ముందుకు రావాలి

**ఐటీ పరిశ్రమల స్థాపనకు అనువైన భవనాలు, కార్యాలయ స్థలాలు, ఖాళీ భూముల వివరాలను పోర్టల్‌లో నమోదు చేయా**

**పెట్టుబడులను ఆకర్షించేందుకు ప్రభుత్వం రూపొందించిన పోర్టల్‌ను సద్వినియోగం చేసుకోవాలి: జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ**

విజయవాడ: జులై 23,2026.ఎన్టీఆర్ జిల్లాను రాష్ట్రంలో ప్రముఖ ఐటీ హబ్‌గా అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలకు భవన యజమానులు, పారిశ్రామికవేత్తలు, భూ యజమానులు, ప్రజలు పూర్తి సహకారం అందించాలని జిల్లా కలెక్టర్ డా.జి.లక్ష్మీశ పిలుపునిచ్చారు. జిల్లాలో ఐటీ పరిశ్రమలు, ఐటీ/ఐటీఈఎస్ సంస్థలు, స్టార్టప్ కంపెనీల స్థాపనకు అవసరమైన మౌలిక వసతులను గుర్తించి పెట్టుబడిదారులకు అందుబాటులోకి తీసుకురావడానికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందన్నారు. ఈ నేపథ్యంలో జిల్లాలో అందుబాటులో ఉన్న కమర్షియల్ భవనాలు, కార్యాలయ స్థలాలు, ఖాళీ భూములు, ఐటీ కార్యకలాపాలకు అనువైన ఇతర ఆస్తుల వివరాలను ప్రభుత్వం రూపొందించిన ఊఅఅటతీఖ.ఖజూ.స్త్రశీజ.అఅ పోర్టల్‌లో నమోదు చేయాలని కలెక్టర్ కోరారు. పెట్టుబడుల ఆకర్షణకు కీలక వేదిక

ఐటీ సంస్థలు కొత్త ప్రాంతాల్లో తమ కార్యకలాపాలను ప్రారంభించేందుకు అవసరమైన సమాచారాన్ని ఒకే వేదికపై అందుబాటులో ఉంచే ఉద్దేశంతో ఈ పోర్టల్‌ను రూపొందించారని కలెక్టర్ తెలిపారు. భవనాలు, కార్యాలయ స్థలాలు, ఖాళీ భూముల వివరాలు పోర్టల్‌లో నమోదు చేయడం ద్వారా దేశీయ, అంతర్జాతీయ పెట్టుబడిదారులు ఆయా ప్రాంతాల్లో అందుబాటులో ఉన్న మౌలిక వసతులను సులభంగా పరిశీలించి పెట్టుబడులు పెట్టే అవకాశాలు మెరుగుపడతాయని పేర్కొన్నారు. జిల్లాలోని కమర్షియల్ భవనాల యజమానులు, కార్యాలయ సముదాయాల నిర్వాహకులు, భూ యజమానులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ ఆస్తుల వివరాలను పోర్టల్‌లో నమోదు చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఈ ప్రక్రియ ద్వారా తమ ఆస్తులకు విస్తృత ప్రచారం లభించడంతో పాటు ఐటీ సంస్థల అవసరాలకు అనుగుణంగా వినియోగంలోకి వచ్చే అవకాశం ఉంటుందని తెలిపారు. ఎన్టీఆర్ జిల్లాలో ఐటీ పరిశ్రమల విస్తరణ ద్వారా ఉపాధి అవకాశాలు పెరగడంతో పాటు యువతకు స్థానికంగానే ఉద్యోగ అవకాశాలు అందుబాటులోకి వస్తాయని కలెక్టర్ పేర్కొన్నారు. ఐటీ రంగ అభివృద్ధి ద్వారా జిల్లాలో ఆర్థిక కార్యకలాపాలు విస్తరించి సమగ్ర అభివృద్ధికి దోహదపడుతుందని అన్నారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన పూర్తి వివరాలు, నమోదు ప్రక్రియపై సమాచారం కోసం జిల్లా ఐటీ అధికారి సుశ్యామ్ 84979 61902 నంబర్‌లో సంప్రదించాలని జిల్లా కలెక్టర్ డా.జి.లక్ష్మీశ సూచించారు.

# యాదాద్రిలో వరుణ యాగం పూర్ణాహుతి

**సమృద్ధిగా వర్షాలు కురవాలని ప్రార్థనలు**

**రైతాంగ సంక్షేమానికి ప్రత్యేక పూజలు**

**ప్రకృతి సమతుల్యతకు ప్రభుత్వం కృషి**





**యాదాద్రి, జూలై 23**

రాష్ట్రంలో సకాలంలో సమృద్ధిగా వర్షాలు కురిసి రైతాంగం సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షిస్తూ యాదాద్రి శ్రీ లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానంలో నిర్వహించిన వరుణ యాగం పూర్ణాహుతి కార్యక్రమంలో మంత్రి కొండా సురేఖ గురువారం పాల్గొన్నారు. ప్రత్యేక పూజలు నిర్వ హించి రాష్ట్ర ప్రజల సంక్షేమం, వ్యవసాయాభివృద్ధి కోసం ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ భారతీయ సంస్కృతిలో ప్రకృతిని దైవస్వరూపంగా భావిస్తారని పేర్కొన్నారు. వరుణ యాగం కేవలం వైదిక క్రతువు మాత్రమే కాకుండా ప్రకృతి సమతుల్యత, ప్రజల శ్రేయస్సు, రైతాంగ సంక్షేమం కోసం నిర్వహించే పవిత్ర యాగమని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా సకాలంలో సమృద్ధి గా వర్షాలు కురిసి చెరువులు, నదులు, జలాశయాలు నిండుకుండల్లా కళకళలాడాలని, రైతులు పంటలతో సుభిక్షంగా ఉండాలని ప్రభుత్వం ఆకాంక్షిస్తోందని మంత్రి చెప్పారు. పచ్చని తెలంగాణ మరింత పచ్చదనంతో విరాజిల్లాలని కోరుతూ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించినట్లు తెలిపారు. ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రకృతి సవాళ్లను సమర్థంగా ఎదుర్కొనే చర్యలతో పాటు దైవానుగ్రహం కోసం రాష్ట్రవ్యాప్తంగా ఆలయాల్లో వరుణ యాగాలు నిర్వహిస్తున్నట్లు మంత్రి వెల్లడించారు. ప్రకృతి పరిరక్షణతో పాటు ఆధ్యాత్మిక సంప్రదాయాలకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని పేర్కొన్నారు. రైతుల సంక్షేమం, వ్యవసాయాభివృద్ధి, రాష్ట్ర ప్రజల శాంతి, సుభిక్షాల కోసం ఈ యాగాలు నిర్వహించడం ఆనవాయితీగా కొనసాగుతోందని మంత్రి తెలిపారు. సమృద్ధిగా వర్షాలు కురిసి ప్రతి రైతు కుటుంబంలో ఆనందం నెలకొనాలని ఆకాంక్షించారు. వరుణ యాగం పూర్ణాహుతి కార్యక్రమంలో ఆలయ అర్చకులు వేదమంత్రోచ్చారణల మధ్య ప్రత్యేక పూజలు నిర్వహించారు.

# యంగ్ ఇండియా పాఠశాల పనుల పరిశీలన

**నిర్మాణ నాణ్యతపై కలెక్టర్ ప్రత్యేక సమీక్ష**

**గడువులోగా పనులు పూర్తి చేయాలని ఆదేశం**

**విద్యార్థులకు అత్యాధునిక వసతులే లక్ష్యం**



**జగిత్యాల, జూలై 23**

ధర్మపురి నియోజకవర్గంలోని నేరెళ్ల గ్రామంలో తెలంగాణ ప్రభుత్వం నిర్మిస్తున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాల నిర్మాణ పనులను జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ గురువారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నిర్మాణ పనుల పురోగతి, నాణ్యత, మౌలిక సదుపాయాల కల్పనపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించి పలు కీలక సూచనలు చేశారు. నిర్మాణంలో ఉన్న విద్యా భవనాలు, తరగతి గదులు, విద్యార్థుల వసతి గృహాలు, భవనాల రూపకల్పన, ఇతర సౌకర్యాలను కలెక్టర్ స్వయంగా పరిశీలించారు. ప్రతి పనిలో నాణ్యతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని, నిర్దేశిత ప్రమాణాలకు అనుగుణంగా నిర్మాణం చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఎలాంటి రాజీ లేకుండా పనులు పూర్తిచేయాలని స్పష్టం చేశారు. పాఠశాల నిర్మాణ పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేసి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలని కలెక్టర్ సూచించారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఆధునిక విద్యా వాతావరణానికి అనుగుణంగా అన్ని సౌకర్యాలు కల్పించాలని పేర్కొన్నారు. విద్యార్థులకు ఉత్తమ విద్యతో పాటు సురక్షితమైన, సౌకర్యవంతమైన వసతి కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. తాగునీటి సదుపాయం, విద్యుత్ సరఫరా, పారిశుద్ధ్య నిర్వహణ, అంతర్గత రహదారులు, ఇతర మౌలిక వసతుల ఏర్పాటుపై ప్రత్యేక దృష్టి సారించాలని సంబంధిత శాఖల అధికారులకు కలెక్టర్ సూచించారు. నిర్మాణ పనుల పురోగతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ నాణ్యతలో ఎలాంటి లోపాలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాలల ద్వారా ప్రభుత్వ విద్యా వ్యవస్థను మరింత బలోపేతం చేయడంతో పాటు విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్యా సదుపాయాలు అందించాలనే లక్ష్యంతో ముందుకు సాగుతోందని కలెక్టర్ పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుబాటులోకి రావడంలో ఈ పాఠశాలలు కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. ఈ పరిశీలన కార్యక్రమంలో ఆర్డీవో మధుసూదన్, జిల్లా విద్యాశాఖ అధికారి కె. రాము, తహసీల్దార్ శ్రీనివాస్, సంబంధిత శాఖల అధికారులు, ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు. నిర్మాణ పనులను నిరంతరం సమీక్షిస్తూ గడువులోగా పూర్తిచేసేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.



## వరంగల్‌లో జల్ సంవాద్ కార్యక్రమం

**వర్షపు నీటి సంరక్షణపై అవగాహన**

**వరంగల్, జూలై 23**

వర్షపు నీటి సంరక్షణ, భూగర్భ జలాల పునరుద్ధరణ లక్ష్యంగా నిర్వహిస్తున్న "క్యాచ్ ది రైన్" ప్రచార కార్యక్రమంలో భాగంగా గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్‌లో గురువారం "జల్ సంవాద్" కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, ప్రజా ప్రతినిధులు, వివిధ వర్గాల ప్రతినిధులు పాల్గొని నీటి వనరుల పరిరక్షణకు చేపట్టాల్సిన చర్యలపై చర్చించారు. నగరంలో భూగర్భ జలాల మట్టాన్ని పెంచేందుకు అమలు చేస్తున్న "శాలో ఆక్విఫర్ మేనేజ్‌మెంట్ 2.0" ప్రాజెక్టు పురోగతిపై సమావేశంలో సమీక్ష నిర్వహించారు. వర్షపు నీటి ఇంకుడు నిర్మాణాలు, భూగర్భ జలాల పునరుద్ధరణకు చేపడుతున్న చర్యలు, జాతీయ మార్గదర్శకాలకు అనుగుణంగా అమలు చేస్తున్న కార్యక్రమాలపై అధికారులు వివరించారు. వర్షపు నీటిని వృథా కాకుండా సేకరించడం, ప్రతి ఇంటిలో వర్షపు నీటి సంరక్షణ వ్యవస్థలను ఏర్పాటు చేయడం, భూగర్భ జలాలను పరిరక్షించడం ద్వారా భవిష్యత్ తరాలకు నీటి భద్రత కల్పించవచ్చని కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు సూచించారు. నీటి వినియోగంలో ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా వర్షపు నీటి సంరక్షణకు ప్రజల భాగస్వామ్యం అత్యంత అవసరమని అధికారులు పేర్కొన్నారు. నగరంలోని వివిధ ప్రాంతాల్లో వర్షపు నీటి ఇంకుడు నిర్మాణాలను మరింత విస్తరించడం ద్వారా భూగర్భ జలాల మట్టాన్ని పెంచేందుకు చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు.

## డీమార్ట్‌లో షాపింగ్‌కు బెస్ట్ టైమ్ ఇదే..!
## ఈ రోజుల్లో వెళ్తే మరింత ఆదా

**ముంబై, జూలై 23**

తక్కువ ధరల్లో నిత్యావసర వస్తువులు కొనుగోలు చేయాలంటే చాలా మంది ముందుగా గుర్తుకు తెచ్చుకునే పేరు డీమార్ట్. దేశవ్యాప్తంగా వందలాది శాఖలతో వినియోగదారులకు అందుబాటులో ఉన్న ఈ రిటైల్ చైన్‌లో కిరాణా సామగ్రి నుంచి గృహోపకరణాలు, దుస్తులు, వ్యక్తిగత సంరక్షణ ఉత్పత్తులు, పిల్లల వస్తువులు వరకు అన్నీ ఒకే చోట లభిస్తాయి. ఇతర దుకాణాలతో పోలిస్తే తక్కువ ధరలు, ఆకర్షణీయమైన ఆఫర్ల కారణంగా ప్రతి నెల వేలాది కుటుంబాలు డీమార్ట్‌లోనే కొనుగోళ్లు చేస్తున్నాయి. డీమార్ట్‌లో ధరలు తక్కువగా ఉండటానికి ప్రధాన కారణం కంపెనీల నుంచి నేరుగా భారీ మొత్తంలో సరుకులను కొనుగోలు చేయడమే. దేశవ్యాప్తంగా ఉన్న శాఖల అవసరాలకు అనుగుణంగా పెద్ద ఎత్తున ఆర్డర్లు ఇవ్వడం వల్ల తయారీ సంస్థలు తక్కువ ధరలకు సరుకులను సరఫరా చేస్తాయి. ఈ ప్రయోజనాన్ని వినియోగదారులకు అందించడంతో అనేక వస్తువులు మార్కెట్ ధర కంటే తక్కువకు లభిస్తుంటాయి. కొన్ని ఉత్పత్తులపై 'బై వన్ గెట్ వన్' వంటి ప్రత్యేక ఆఫర్లు కూడా తరచూ అందుబాటులో ఉంటాయి. డీమార్ట్‌లో ఏ రోజు షాపింగ్ చేస్తే ఎక్కువ తగ్గింపులు, తక్కువ రద్దీ ఉంటుందనే సందేహం చాలామందిలో ఉంటుంది.



# వసతి గృహాల తనిఖీలు.. సదుపాయాలపై ప్రత్యేక దృష్టి

### కలెక్టర్ ఆదేశాలతో క్షేత్రస్థాయిలో పరిశీలనలు

మహబూబాబాద్, జూలై 23

జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ ఆదేశాల మేరకు గురువారం మహబూబాబాద్ జిల్లాలోని అన్ని ప్రభుత్వ వసతి గృహాల్లో ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. ప్రత్యేక అధికారులతో పాటు సంబంధిత శాఖల సిబ్బంది తమకు కేటాయించిన వసతి గృహాలను క్షేత్రస్థాయిలో సందర్శించి విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలను పరిశీలించారు. తనిఖీల సందర్భంగా వసతి గృహాల్లో మౌలిక వసతులు, పరిశుభ్రత, తాగునీరు, మరుగుదొడ్లు, విద్యుత్ సరఫరా, విద్యార్థులకు అందిస్తున్న ఇతర సౌకర్యాలను అధికారులు పరిశీలించారు. విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అవసరమైన సదుపాయాలను కల్పించాలని సంబంధిత అధికారులకు సూచించారు. విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనం నాణ్యతను కూడా అధికారులు పరిశీలించారు. ఆహార పదార్థాల నాణ్యత, వంటశాల పరిశుభ్రత, మెనూ అమలు తదితర అంశాలను తనిఖీ చేసి, ప్రభుత్వం నిర్దేశించిన ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని నిర్వాహకులకు ఆదేశించారు. ఈ సందర్భంగా ఎస్ఐఆర్ సవరణ డిజిటలైజేషన్ ప్రక్రియ పురోగతిని కూడా అధికారులు సమీక్షించారు. డిజిటలైజేషన్ పనులను వేగవంతంగా, నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని, నమోదయ్యే వివరాల్లో ఎలాంటి పొరపాట్లు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. జిల్లాలోని వసతి గృహాల్లో విద్యార్థులకు మెరుగైన వసతి, నాణ్యమైన ఆహారం, అవసరమైన అన్ని సౌకర్యాలు అందేలా నిరంతర పర్యవేక్షణ కొనసాగుతుందని అధికారులు తెలిపారు.



# ఈ-సాండ్ పోర్టల్ అమలుపై కలెక్టర్ ఆదేశాలు

### టోకెన్ లేకుండా ఖనిజ రవాణాకు అనుమతి లేదు

### అక్రమ రవాణాపై కట్టుదిట్టమైన నిఘా

జనగామ, జూలై 23

జిల్లాలో ఇసుక, మొరం సరఫరా పూర్తిగా పారదర్శకంగా, నిబంధనలకు అనుగుణంగా జరిగేలా ఈ-సాండ్ పోర్టల్‌ను సమర్థవంతంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశించారు. ప్రభుత్వ అభివృద్ధి పనులకు అవసరమైన ఇసుక, మొరం అనుమతులు కూడా తప్పనిసరిగా ఈ-సాండ్ పోర్టల్ ద్వారానే పొందాలని స్పష్టం చేశారు. గురువారం జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలో డీసీపీ రాజ మహేంద్ర నాయక్‌తో కలిసి మైనింగ్, రవాణా, నీటి పారుదల తదితర శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన ఈ ఆదేశాలు జారీ చేశారు. జిల్లా కమిటీ నిర్ణయించిన ధరల ప్రకారం మొరం ప్రతి క్యూబిక్ మీటర్‌కు రూ.95, ఇసుక ప్రతి క్యూబిక్ మీటర్‌కు రూ.300గా నిర్ణయించినట్లు కలెక్టర్ తెలిపారు. నిర్ణీత రుసుమును ముందస్తుగా చెల్లించిన తర్వాత ఈ-సాండ్ పోర్టల్ ద్వారా అనుమతులు మంజూరు చేయనున్నట్లు వెల్లడించారు. జనగామ జిల్లా ఈ-సాండ్ పోర్టల్ అమలులో రాష్ట్రానికి ఆదర్శంగా నిలుస్తోందని, అనుమతుల ప్రక్రియను పూర్తిగా డిజిటల్ విధానంలో నిర్వహించడం ద్వారా పారదర్శకత పెరిగిందన్నారు. ఇసుక, మొరం రవాణాలో టోకెన్ విధానాన్ని కచ్చితంగా అమలు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రతి వాహనానికి క్యూ ఆర్ కోడ్ ఆధారిత ధ్రువీకరణ తప్పనిసరిగా ఉండాలని, క్యూ ఆర్ కోడ్‌ను స్కాన్ చేసిన సమాచారం నేరుగా సర్వర్‌కు చేరే విధంగా వ్యవస్థను సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు.



# విద్యార్థుల భద్రతపై పోలీసుల అవగాహన

### ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ

హైదరాబాద్, జూలై 23

ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల భద్రత, అవగాహన పెంపే లక్ష్యంగా నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో సరూర్‌నగర్ పోలీసులు పాల్గొన్నారు. స్మైల్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సైకిళ్ల పంపిణీ కార్యక్రమంలో విద్యార్థులకు సైకిళ్లు అందజేయడంతో పాటు భద్రతకు సంబంధించిన కీలక అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పోలీసులు విద్యార్థులకు సైబర్ భద్రతపై పలు సూచనలు చేశారు. గుర్తు తెలియని వ్యక్తులతో వ్యక్తిగత సమాచారం పంచుకోవద్దని, అనుమానాస్పద సందేశాలు, లింకులు, ఆన్‌లైన్ మోసాల విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఏవైనా అనుమానాస్పద ఘటనలు ఎదురైతే వెంటనే తల్లిదండ్రులు లేదా పోలీసులకు సమాచారం ఇవ్వాలని చెప్పారు. వ్యక్తిగత భద్రతకు సంబంధించిన అంశాలపైనా విద్యార్థులకు అవగాహన కల్పించారు. పాఠశాలకు వెళ్లే సమయంలో, తిరిగి ఇంటికి వచ్చే సమయంలో రహదారి భద్రతా నియమాలు పాటించాలని, అపరిచితుల మాటలు నమ్మి వారితో వెళ్లకూడదని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో ఎలా స్పందించాలనే విషయాన్ని కూడా వివరించారు. ఈ కార్యక్రమంలో స్మైల్ ఆర్గనైజేషన్ ప్రతినిధులు, సరూర్‌నగర్ పోలీసులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థుల భద్రతకు ప్రాధాన్యం ఇస్తూ ఇటువంటి అవగాహన కార్యక్రమాలను భవిష్యత్తులో కూడా కొనసాగిస్తామని పోలీసులు తెలిపారు.

# ప్రభుత్వ ఆసుపత్రిలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

### రోగులకు మెరుగైన వైద్య సేవలపై ఆదేశాలు

### మౌలిక సదుపాయాలకు రూ.50 లక్షల మంజూరు

### ఆసుపత్రి పరిశుభ్రతపై అధికారులకు హెచ్చరిక



గద్వాల, జూలై 23

ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే ప్రతి రోగికి నాణ్యమైన వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ వైద్యాధికారులను ఆదేశించారు. గురువారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిని ఆకస్మికంగా సందర్శించిన కలెక్టర్ ఐసీయూ, వివిధ వార్డులను పరిశీలించి రోగులతో నేరుగా మాట్లాడారు. వారికి అందుతున్న వైద్య సేవలపై ఆరా తీస్తూ సమస్యలను తెలుసుకున్నారు. ఆసుపత్రిలో ఖాళీగా ఉన్న వైద్య, ఇతర సిబ్బంది పోస్టులను నిబంధనల ప్రకారం భర్తీ చేసేందుకు వెంటనే చర్యలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. ఆసుపత్రి పరిసరాల్లో పొదలు పెరిగి అపరిశుభ్రంగా ఉండడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వినియోగంలో లేని పాత మంచాలు, వైద్య పరికరాలను ఎక్కడపడితే అక్కడ నిల్వ చేయకుండా వేలం వేసి తొలగించాలని అధికారులను ఆదేశించారు. పరీక్షలు, చికిత్స విభాగంలో పనిచేయని మానిటర్ యంత్రాన్ని వెంటనే వినియోగంలోకి తీసుకురావాలని కలెక్టర్ ఆదేశించారు. ఆసుపత్రికి అవసరమైన మందులు, నిత్యావసర పరికరాల ప్రతిపాదనలు పంపిస్తే వెంటనే నిధులు మంజూరు చేస్తామని తెలిపారు. శస్త్రచికిత్స విభాగంలో అవసరమైన సదుపాయాల కల్పనపై కూడా పలు సూచనలు చేశారు. ఆసుపత్రిలో మరమ్మత్తులు, విద్యుత్ వ్యవస్థ, పైకప్పు లీకేజీలు, కిటికీలు, తలుపులు, వాహనాల పార్కింగ్ షెడ్ తదితర పనుల కోసం ఇప్పటికే రూ.50 లక్షలు కేటాయించినప్పటికీ పనులు ప్రారంభించకపోవడంపై సంబంధిత అధికారులను కలెక్టర్ నిలదీశారు. అన్ని పనులను వేగవంతంగా పూర్తి చేయాలని, పై అంతస్తులోని 50 పడకల వార్డుకు వెళ్లే ర్యాంపుపై అత్యవసరంగా పైకప్పు నిర్మించాలని గుత్తేదారును ఆదేశించారు. రోగుల సహాయకుల కోసం వేచిచూడే షెడ్ కూడా ఏర్పాటు చేయాలని సూచించారు. వైద్యాధికారులతో సమావేశమైన కలెక్టర్ హాజరు రిజిస్టర్లు, ఇతర రికార్డులను తనిఖీ చేశారు. విధులకు హాజరుకాని వైద్యులపై చర్యలు తీసుకోవాలని సూచించారు. భద్రత, పారిశుద్ధ్య సేవల కోసం నియమించిన సిబ్బంది సేవలను సమర్థంగా వినియోగించుకోవాలని, అవసరమైతే అదనపు సిబ్బందిని నియమించాలని అధికారులను ఆదేశించారు. దివ్యాంగుల శిబిర భవనం, రేడియాలజీ, ఇతర విభాగాలను పరిశీలించి తగిన సూచనలు చేశారు. ఆసుపత్రి పరిసరాల్లో నిరుపయోగంగా ఉన్న వైద్య సిబ్బంది నివాస భవనాలను సద్వినియోగం చేసుకునేలా ప్రణాళికలు రూపొందించాలని కలెక్టర్ సూచించారు. ఆసుపత్రికి నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా విద్యుత్ శాఖతో సమన్వయం చేసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఆసుపత్రిలో ఎలాంటి సమస్యలు లేకుండా రోగులకు అన్ని సౌకర్యాలు కల్పించేందుకు అవసరమైతే అదనపు నిధులు కూడా మంజూరు చేస్తామని కలెక్టర్ స్పష్టం చేశారు.





# బ్లాక్ స్పాట్లపై సీపీ ప్రత్యేక దృష్టి

### రోడ్డు ప్రమాదాల నివారణకు సమన్వయ చర్యలు

### జాతీయ రహదారిపై ప్రమాద ప్రాంతాల పరిశీలన

### భద్రతా చర్యలు వేగవంతం చేయాలని ఆదేశాలు

హనుమకొండ, జూలై 23

వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో తరచూ రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకుంటున్న బ్లాక్ స్పాట్లపై వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత ప్రత్యేక దృష్టి సారించారు. గురువారం సంబంధిత పోలీసు అధికారులు, జాతీయ రహదారి అథారిటీ, రోడ్డు రవాణా శాఖ, ఎక్సైజ్ శాఖ అధికారులతో కలిసి జాతీయ రహదారి--163పై హనుమకొండ--హైదరాబాద్ ప్రధాన రహదారి మార్గంలో ప్రమాదాలు ఎక్కువగా జరిగే పది మందికిపైగా బ్లాక్ స్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రమాదాలు తరచుగా సంభవించడానికి గల కారణాలను సంబంధిత అధికారులతో కలిసి సమగ్రంగా పరిశీలించారు. ప్రమాదాల నివారణకు అవసరమైన చర్యలపై విస్తృతంగా చర్చించి, అన్ని శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేసి తక్షణ చర్యలు చేపట్టాలని పోలీస్ కమిషనర్ ఆదేశించారు. ప్రజల ప్రాణాల రక్షణకు రహదారి భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. జాతీయ రహదారి నుంచి గ్రామాలకు వెళ్లే అనుసంధాన రహదారులు, డివైడర్ ఓపెనింగ్‌లు ఉన్న ప్రాంతాల్లో రాత్రి వేళల్లో వాహనదారులకు స్పష్టంగా కనిపించేలా తగిన లైటింగ్ ఏర్పాటు చేయాలని సూచించారు. అలాగే ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డులు, దిశా నిర్దేశక సూచికలు, రిఫ్లెక్టివ్ సైన్ బోర్డులను అధిక సంఖ్యలో ఏర్పాటు చేయాలని జాతీయ రహదారి అధికారులకు ఆదేశించారు. జాతీయ రహదారి వెంట ఉన్న మద్యం దుకాణాల వద్ద వాహనాల రాకపోకలకు ఆటంకం కలగకుండా పార్కింగ్‌ను క్రమబద్ధీకరించేలా సంబంధిత వ్యాపారులతో చర్చించి చర్యలు తీసుకోవాలని ఎక్సైజ్ శాఖ అధికారులకు సూచించారు. ప్రమాదాలకు దారితీసే పరిస్థితులను ముందుగానే నివారించేలా అన్ని శాఖలు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని తెలిపారు. పరిశీలన సందర్భంగా స్థానిక ప్రజాప్రతినిధులు, ప్రజలతో మాట్లాడిన పోలీస్ కమిషనర్ వారి సమస్యలను తెలుసుకున్నారు. కరుణాపురం వద్ద పాదచారుల కోసం ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మించాలని స్థానికులు కోరగా, అవసరమైన ప్రాంతాల్లో అలాంటి వంతెనల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని జాతీయ రహదారి అధికారులను ఆదేశించారు. అనంతరం ప్రమాద బాధితులను అత్యవసరంగా ఆసుపత్రులకు తరలించేందుకు ఏర్పాటు చేసిన అంబులెన్స్‌ను పరిశీలించి, అందులోని వైద్య సదుపాయాలు, సిబ్బంది స్పందన తీరుపై ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో వెస్ట్ జోన్ డీసీపీ రాజమహేంద్ర నాయక్, ట్రాఫిక్ అదనపు డీసీపీ రాయల ప్రభాకర్ రావు, ఘనపూర్ ఏసీపీ భీంశర్మతో పాటు జాతీయ రహదారి అథారిటీ, రోడ్డు రవాణా శాఖ, ఎక్సైజ్ శాఖ అధికారులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. రోడ్డు ప్రమాదాలను తగ్గించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తూ భద్రతా చర్యలను మరింత బలోపేతం చేయాలని పోలీస్ కమిషనర్ సూచించారు.

# సంగారెడ్డి పోలీసు కార్యాలయాన్ని తనిఖీ చేసిన ఐజి

### వార్షిక తనిఖీల్లో భాగంగా సమగ్ర పరిశీలన

### సాంకేతికతతో నేర నియంత్రణకు ఆదేశాలు

### కమ్యూనిటీ పోలీసింగ్‌కు ప్రాధాన్యం




సంగారెడ్డి, జూలై 23

వార్షిక తనిఖీలలో భాగంగా మల్టీ జోన్--2 ఐజి షానవాజ్ ఖాసిం సంగారెడ్డి జిల్లా పోలీసు కార్యాలయం, ట్రాఫిక్ పోలీసు స్టేషన్‌ను గురువారం తనిఖీ చేశారు. పోలీసు శాఖ పనితీరు, నేరాల నియంత్రణ చర్యలు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగంపై సమగ్రంగా సమీక్ష నిర్వహించి అధికారులకు పలు కీలక సూచనలు చేశారు. తనిఖీ సందర్భంగా జిల్లా పోలీసు కార్యాలయంలోని వివిధ విభాగాల పనితీరు, కేసుల దర్యాప్తు, రికార్డుల నిర్వహణ, ప్రజలకు అందిస్తున్న సేవలను పరిశీలించారు. నేరాల నియంత్రణలో సాంకేతికతను మరింత సమర్థవంతంగా వినియోగిస్తూ ఆధారాల సేకరణ, దర్యాప్తు ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. కమ్యూనిటీ పోలీసింగ్‌ను మరింత బలోపేతం చేయాలని ఐజి ఆదేశించారు. ప్రజలతో పోలీసుల అనుసంధానం పెంచడంతో పాటు స్థానిక సమస్యలను వేగంగా పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజల్లో భద్రతాభావం పెంపొందించే కార్యక్రమాలను నిరంతరం నిర్వహించాలని పేర్కొన్నారు. సీసీ కెమెరాల విస్తరణపై ప్రత్యేక దృష్టి సారించాలని ఐజి సూచించారు. నేరాల నివారణ, దర్యాప్తులో సీసీ కెమెరాలు కీలక పాత్ర పోషిస్తున్నందున మరిన్ని ప్రాంతాల్లో నిఘా వ్యవస్థను బలోపేతం చేయాలని ఆదేశించారు. అలాగే సైబర్ నేరాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటూ ప్రజల్లో అవగాహన కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహించాలని తెలిపారు. పోలీసు శాఖ ప్రజలకు మరింత సమర్థవంతమైన సేవలు అందించేలా అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలని ఐజి షానవాజ్ ఖాసిం సూచించారు. నేరాల నియంత్రణ, ట్రాఫిక్ నిర్వహణ, సైబర్



భద్రత వంటి అంశాల్లో ఆధునిక సాంకేతికతను వినియోగిస్తూ ప్రజల భద్రతకు అత్యున్నత ప్రాధాన్యం ఇవ్వాలని అధికారులను ఆదేశించారు.





# ఎన్‌సీసీ యూనిట్లకు శిక్షణ సామగ్రి పంపిణీ

**యువతలో నాయకత్వ లక్షణాల పెంపే లక్ష్యం**

**సీఎస్ఆర్ నిధులతో రూ.9 లక్షల సామగ్రి అందజేత**

**క్రమశిక్షణ, దేశసేవకు ఎన్‌సీసీ వేదిక**

**భద్రాద్రి కొత్తగూడెం, జూలై 23**

యువతలో క్రమశిక్షణ, దేశభక్తి, నాయకత్వ లక్షణాలు, సేవాభావాన్ని పెంపొందించి వారిని ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడంలో నేషనల్ క్యాడెట్ కార్ప్స్ (ఎన్‌సీసీ) కీలక పాత్ర పోషిస్తోందని జిల్లా కలెక్టర్ అంకిత్ అన్నారు. ఐడీఓసీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎస్సెన్షియా అడ్వాన్స్‌డ్ సైన్సెస్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ తమ కార్పొరేట్ సామాజిక బాధ్యత నిధుల ద్వారా జిల్లాలోని 25 ఎన్‌సీసీ యూనిట్లకు రూ.9 లక్షల విలువైన శిక్షణ సామగ్రిని అందజేయగా, జిల్లా కలెక్టర్ వాటిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్‌సీసీ విద్యార్థుల్లో క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, సమయపాలన, నాయకత్వ నైపుణ్యాలు, జాతీయ సమైక్యత భావన, సేవా దృక్పథాన్ని పెంపొందిస్తుందని తెలిపారు. విద్యార్థుల వ్యక్తిత్వ వికాసం, శారీరక దృఢత్వం, సామాజిక బాధ్యత, దేశసేవ పట్ల అంకితభావాన్ని పెంచడంలో ఎన్‌సీసీ శిక్షణ విశేషంగా దోహదపడుతుందని పేర్కొన్నారు. ప్రకృతి వైపరీత్యాలు, అత్యవసర పరిస్థితులు, రక్తదాన శిబిరాలు, పర్యావరణ పరిరక్షణ, స్వచ్ఛత కార్యక్రమాలు వంటి సామాజిక సేవా కార్యక్రమాల్లో ఎన్‌సీసీ క్యాడెట్లు అందిస్తున్న సేవలు అభినందనీయమని కలెక్టర్ అన్నారు. జట్టు భావన, క్రమశిక్షణ, సేవా దృక్పథం, నాయకత్వ లక్షణాలను అలవర్చుకునేందుకు ఎన్‌సీసీ ఉత్తమ వేదికగా నిలుస్తోందని చెప్పారు. ప్రభుత్వ కార్యక్రమాలకు కార్పొరేట్ సంస్థలు కార్పొరేట్ సామాజిక బాధ్యత నిధుల ద్వారా సహకరించడం అభినందనీయమని కలెక్టర్ పేర్కొన్నారు. అందజేసిన శిక్షణ సామగ్రి రాష్ట్ర, జాతీయ స్థాయి శిక్షణా శిబిరాలు, గణతంత్ర దినోత్సవ శిబిరాలు తదితర పోటీల్లో ఎన్‌సీసీ క్యాడెట్లు మరింత ప్రతిభ కనబర్చేందుకు ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని 25 ఎన్‌సీసీ యూనిట్లకు 190 డమ్మీ తుపాకులు, 130 కంపాస్‌లు, 130 సర్వీస్ ప్రొట్రాక్టర్లు, 190 ఎన్‌సీసీ హ్యాండ్‌బుక్‌లు, 100 పోటీ పరీక్షల పుస్తకాలను పంపిణీ చేశారు. జిల్లా క్రీడల శాఖ అధికారి పరంధామరెడ్డి, 11 తెలంగాణ బెటాలియన్ ఎన్‌సీసీ అధికారులు, 25 ఎన్‌సీసీ యూనిట్ల ఏఎన్‌ఓలు, 120 మంది ఎన్‌సీసీ క్యాడెట్లు, 7 డిగ్రీ కళాశాలలు, 18 పాఠశాలల ప్రతినిధులు కార్యక్రమంలో పాల్గొన్నారు.



# శ్రమ గౌరవమే సమాజ అభివృద్ధి

**చేతివృత్తుల ప్రాధాన్యంపై మంత్రి సందేశం**

**వెదురుబుట్ట అల్లిన మంత్రి కొండా సురేఖ**

**యాదాద్రి, జూలై 23**

ఆదిమ సమాజం నుంచి ఆధునిక నాగరికత వరకు మానవ పురోగతికి ప్రధాన చోదకశక్తి శ్రమేనని మంత్రి కొండా సురేఖ అన్నారు. యాదాద్రిలో నిర్వహించిన కార్యక్రమంలో వెదురుబుట్ట అల్లే ప్రక్రియలో పాల్గొన్న ఆమె చేతివృత్తుల గొప్పతనం, శ్రమ విలువపై తన అభిప్రాయాలను వెల్లడించారు. చేతులతో శ్రమ చేయడం ద్వారా మనిషి ప్రకృతిపై తన ఆధిపత్యాన్ని పెంచుకున్నాడని మంత్రి పేర్కొన్నారు. చేతులు, మెదడు పరస్పరం అనుసంధానమై కొత్త ఆవిష్కరణలకు, నాగరికత వికాసానికి బాటలు వేసాయని తెలిపారు. చేతులు కేవలం అవయవాలు మాత్రమే కాకుండా సృష్టికి, అభివృద్ధికి సాధనాలుగా నిలిచాయని చెప్పారు. వెదురుబుట్ట అల్లేందుకు చేసిన ప్రయత్నం ద్వారా చేతివృత్తుల వెనుక ఉన్న నైపుణ్యం, ఓర్పు, కష్టాన్ని మరింత దగ్గరగా అనుభవించే అవకాశం లభించిందని మంత్రి అన్నారు. ఈ అనుభవం చేతివృత్తులపై తనకు ఉన్న గౌరవాన్ని మరింత పెంచిందని పేర్కొన్నారు. యాదగిరిగుట్ట నేడు వరుణయాగానికి మాత్రమే కాకుండా శ్రమయాగానికి కూడా ప్రతీకగా నిలిచిందని మంత్రి వ్యాఖ్యానించారు. శ్రమించే ప్రతి చేతిని గౌరవించడం సమాజ బాధ్యత అని, చేతివృత్తుల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. చేతివృత్తులు మన సంప్రదాయాలకు, సంస్కృతికి ప్రతిబింబమని మంత్రి తెలిపారు. వాటిని ప్రోత్సహించడం ద్వారా గ్రామీణ జీవనోపాధి బలోపేతం కావడంతో పాటు సంప్రదాయ కళలు కూడా తరతరాలకు నిలుస్తాయని చెప్పారు. శ్రమను గౌరవించే సమాజమే తన సంస్కృతిని చిరకాలం నిలబెట్టుకోగలదని మంత్రి కొండా సురేఖ పేర్కొన్నారు. శ్రమజీవుల కష్టాన్ని గుర్తించి వారికి తగిన గౌరవం, ప్రోత్సాహం అందించడం ద్వారానే సమాజం సమగ్ర అభివృద్ధి సాధిస్తుందని ఆమె అన్నారు.








# సీజేపీ నిరసనలపై హైకోర్టులో పిల్

**విదేశీ నిధులపై దర్యాప్తు కోరిన పిటిషనర్**

**శుక్రవారం విచారణ చేపట్టనున్న ధర్మాసనం**

**నీట్ ఉద్యమం రాజకీయ మలుపు తిరిగిందని ఆరోపణ**

**న్యూఢిల్లీ, జూలై 23**

నీట్ పేపర్ లీకేజీ వ్యవహారంపై కాక్రోచ్ జనతా పార్టీ చేపట్టిన 'చలో పార్లమెంట్' నిరసనల నేపథ్యంలో ఢిల్లీ హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలైంది. ఈ ఆందోళనల నిర్వహణకు విదేశీ నిధులు అందినట్లు ఆరోపిస్తూ, ఆ అంశంపై జాతీయ దర్యాప్తు సంస్థతో విచారణ జరిపించాలని పిటిషనర్ కోర్టును కోరారు. ఈ ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని సతీశ్ కుమార్ అగర్వాల్ దాఖలు చేయగా, అడ్వకేట్ బారున్ కుమార్ సిన్హా తరఫున వాదనలు వినిపించనున్నారు. ఈ పిటిషన్‌పై శుక్రవారం ప్రధాన న్యాయమూర్తి డీకే ఉపాధ్యాయ, న్యాయమూర్తి తేజస్ కరియాతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టనున్నట్లు సమాచారం. 'చలో పార్లమెంట్' నిరసనల కారణంగా దేశ రాజధాని ఢిల్లీలో సాధారణ జనజీవనం తీవ్రంగా ప్రభావితమైందని పిటిషన్‌లో పేర్కొన్నారు. నీట్ పేపర్ లీకేజీ అంశంతో ప్రారంభమైన ఉద్యమం తరువాత రాజకీయ మలుపు తిరిగిందని, వివిధ రాజకీయ పార్టీల నాయకులు కూడా ఈ ఆందోళనల్లో పాల్గొన్నారని ఆరోపించారు. ఈ నిరసనలకు సామాజిక కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్ మద్దతు తెలిపారని, ఆయనకు విదేశీ సంస్థలతో సంబంధాలు ఉన్నాయని కూడా పిటిషన్‌లో ప్రస్తావించారు.

ఈ అంశాలపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని కోర్టును కోరారు. అయితే పిటిషన్‌లో చేసిన ఆరోపణలు ప్రస్తుతం కోర్టు పరిశీలనలో ఉన్నాయని, వాటిపై ఇంకా ఎలాంటి న్యాయపరమైన నిర్ధారణ వెలువడలేదని గమనించాల్సి ఉంది. ఈ ఆరోపణలపై సంబంధిత పక్షాల వాదనలు, కోర్టు విచారణ అనంతరం తదుపరి పరిణామాలు స్పష్టమయ్యే అవకాశం ఉంది. శుక్రవారం జరగనున్న విచారణలో పిటిషనర్ వాదనలు, సంబంధిత పక్షాల అభిప్రాయాలను విన్న అనంతరం ఢిల్లీ హైకోర్టు తదుపరి ఆదేశాలు జారీ చేసే అవకాశం ఉంది. ఈ వ్యవహారం దేశవ్యాప్తంగా ఆసక్తిని రేకెత్తిస్తోంది.

# మెట్రో స్టేషన్ల మూసివేతపై సుప్రీంకోర్టు ఆందోళన

**న్యాయవాదుల ఇబ్బందులపై ప్రధాన న్యాయమూర్తి స్పందన**

**సమస్య పరిష్కారం కాకపోతే జోక్యం చేసుకుంటానని హామీ**

**16 మెట్రో స్టేషన్ల సేవలు నిలిపివేతతో ప్రయాణికుల ఇబ్బందులు**

**న్యూఢిల్లీ, జూలై 23**

దేశ రాజధాని ఢిల్లీలో విద్యార్థుల నిరసనల నేపథ్యంలో పలు మెట్రో స్టేషన్లను మూసివేయడంపై గురువారం సుప్రీంకోర్టులో ప్రస్తావన వచ్చింది. ఈ చర్యల వల్ల న్యాయవాదులు, కోర్టు సిబ్బంది ఎదుర్కొంటున్న ఇబ్బందులను సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వికాస్ సింగ్ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ దృష్టికి తీసుకెళ్లారు. సుప్రీంకోర్టు మెట్రో స్టేషన్‌తో పాటు మొత్తం 16 మెట్రో స్టేషన్లలో సేవలను నిలిపివేయడంతో కోర్టుకు సమయానికి చేరుకోవడం కష్టంగా మారిందని వికాస్ సింగ్ తెలిపారు. సుప్రీంకోర్టు గుర్తింపు కార్డులు కలిగిన న్యాయవాదులు, రిజిస్ట్రీ సిబ్బందికి మెట్రో స్టేషన్‌లో దిగేందుకు అనుమతి ఇచ్చి, బయటకు వెళ్లే సమయంలో భద్రతా తనిఖీలు నిర్వహించాలని సూచించారు. దీనిపై స్పందించిన ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ ఇప్పటికే ఈ అంశంపై మెట్రో అధికారులతో మాట్లాడాలని సుప్రీంకోర్టు యంత్రాంగాన్ని ఆదేశించినట్లు వెల్లడించారు. మధ్యాహ్న భోజన విరామ సమయానికి సమస్య పరిష్కారం కాకపోతే తానే స్వయంగా జోక్యం చేసుకుంటానని స్పష్టం చేశారు. అదేవిధంగా, మెట్రో స్టేషన్ల మూసివేత కారణంగా న్యాయవాదులు కోర్టుకు హాజరు కాలేకపోయిన కేసుల్లో ఎలాంటి ప్రతికూల ఉత్తర్వులు జారీ చేయవద్దని కూడా న్యాయస్థానానికి సూచించినట్లు ప్రధాన న్యాయమూర్తి తెలిపారు. దీంతో న్యాయవాదులకు తాత్కాలిక ఊరట లభించింది. ఇదిలా ఉండగా, 'కాక్రోచ్ జనతా పార్టీ' ఆధ్వర్యంలో జంతర్ మంతర్ వద్ద కొనసాగుతున్న ఆందోళనల నేపథ్యంలో భద్రతా కారణాలతో పలు మెట్రో స్టేషన్లను మూసివేసినట్లు అధికారులు తెలిపారు. తదుపరి ఆదేశాలు వచ్చే వరకు ఈ నిర్ణయం అమల్లో ఉంటుందని ఢిల్లీ మెట్రో ప్రకటించింది. మెట్రో సేవల నిలిపివేతతో రోజువారీ ప్రయాణికులు, ఉద్యోగులు, విద్యార్థులు, న్యాయవాదులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పరిస్థితిని సమీక్షించిన అనంతరం తదుపరి నిర్ణయం తీసుకోనున్నట్లు సంబంధిత అధికారులు తెలిపారు.





# డీజీపీ కార్యాలయంలో కానిస్టేబుల్ ఆత్మహత్య

**సర్వీస్ రివాల్వర్‌తో కాల్చుకుని బలవన్మరణం**

**సూసైడ్ నోట్ స్వాధీనం చేసుకున్న పోలీసులు**

**ఘటనపై సమగ్ర దర్యాప్తు ప్రారంభం**

**హైదరాబాద్, జూలై 23**



హైదరాబాద్‌లోని తెలంగాణ డీజీపీ కార్యాలయంలో గురువారం ఉదయం విషాదకర ఘటన చోటుచేసుకుంది. డీజీపీ కార్యాలయంలో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న స్వామి అనే పోలీసు సిబ్బంది తన సర్వీస్ రివాల్వర్‌తో కాల్చుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఈ ఘటనతో పోలీసు శాఖలో తీవ్ర విషాదం నెలకొంది. సమాచారం అందుకున్న ఉన్నతాధికారులు వెంటనే ఘటనాస్థలికి చేరుకుని దర్యాప్తు ప్రారంభించారు. పోలీసుల ప్రాథమిక వివరాల ప్రకారం, రాత్రి విధులు నిర్వహిస్తున్న స్వామి ఉదయం సుమారు 5.30 గంటల సమయంలో కార్యాలయంలోని వాష్‌రూమ్‌లోకి వెళ్లారు. అక్కడ తన వద్ద ఉన్న సర్వీస్ రివాల్వర్‌తో కాల్చుకోవడంతో తీవ్ర గాయాలపాలై అక్కడికక్కడే మృతి చెందినట్లు అధికారులు తెలిపారు. అనంతరం సహచర సిబ్బంది గమనించి ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. ఘటనాస్థలంలో కానిస్టేబుల్ రాసిన సూసైడ్ నోట్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అందులో తన మరణానికి భార్య, పిల్లలకు ఎలాంటి సంబంధం లేదని, వారిని ఎవరూ ఇబ్బంది పెట్టవద్దని కోరినట్లు పోలీసులు తెలిపారు. తన కుటుంబాన్ని ఎల్లప్పుడూ కాపాడాలని భావిస్తున్నానని రాసిన ఆయన చివరి సందేశం అందరినీ కలచివేసింది. ఆత్మహత్యకు గల కారణాలపై పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తు చేపట్టారు. వ్యక్తిగత, కుటుంబ, ఉద్యోగ సంబంధిత అంశాలతో పాటు ఇతర పరిస్థితులను కూడా పరిశీలిస్తున్నట్లు అధికారులు తెలిపారు. సూసైడ్ నోట్‌లోని వివరాలను విశ్లేషిస్తూ పూర్తి స్థాయి విచారణ కొనసాగుతోంది. ఈ ఘటన నేపథ్యంలో పోలీసు సిబ్బందిపై విధి ఒత్తిళ్లు, మానసిక ఆరోగ్య పరిరక్షణ వంటి అంశాలు మరోసారి చర్చనీయాంశంగా మారాయి. ఉద్యోగులతో పాటు వారి కుటుంబ సభ్యులకు అవసరమైన మానసిక ఆరోగ్య సహాయాన్ని మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు అన్ని ఆధారాలను సేకరిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించి, అనంతర చట్టపరమైన ప్రక్రియ చేపట్టారు. దర్యాప్తు పూర్తయిన తర్వాత పూర్తి వివరాలను వెల్లడిస్తామని ఉన్నతాధికారులు తెలిపారు.







# వైభవ్ సూర్యవంశీ దంచుడు



## తొలి టీ20లో జింబాబ్వేపై విజయం

**జింబాబ్వే పర్యటనను భారత జట్టు ఘన విజయంతో ప్రారంభించింది. హరారే వేదికగా జరిగిన తొలి టీ20 మ్యాచ్‌లో టీమిండియా 7 వికెట్ల తేడాతో జింబాబ్వేను చిత్తు చేసింది. యువ ఆటగాడు వైభవ్ సూర్యవంశీ (50; 19 బంతుల్లో 4-4, 4-6) విధ్వంసకర అర్ధశతకంతో చెలరేగడంతో టీమిండియా సునాయాసంగా నెగ్గింది.**

ఈ విజయంతో మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో భారత్ 1-0 ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. 126 పరుగుల స్వల్ప లక్ష్యంతో బరిలోకి దిగిన భారత్‌కు ఆరంభంలోనే ఎదురుదెబ్బ తగిలింది. అభిషేక్ శర్మ (1) త్వరగా ఔటయ్యాడు. అయితే, మరో ఓపెనర్ వైభవ్ సూర్యవంశీ ఆకాశమే హద్దుగా చెలరేగాడు. కేవలం 19 బంతుల్లోనే మెరుపు అర్ధశతకం పూర్తి చేసి జింబాబ్వే బౌలర్లను ఉతికారేశాడు. అతనికి ఇషాన్ కిషన్ (35) చక్కటి సహకారం అందించడంతో భారత్ విజయం సులువైంది. వీరిద్దరూ ఔటయ్యాక, కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ (28 నాటౌట్), తిలక్ వర్మ (6 నాటౌట్) మిగిలిన లాంఛనాన్ని పూర్తి చేశారు. దీంతో భారత్ 13.2 ఓవర్లలోనే 3 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. జింబాబ్వే బౌలర్లలో బ్లెస్సింగ్ ముజరబానీ రెండు వికెట్లు తీశాడు. అంతకుముందు, టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకున్న భారత కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ నిర్ణయం సరైనదని బౌలర్లు నిరూపించారు. యువ పేసర్ మయాంక్ యాదవ్ (2/18) తన వేగంతో జింబాబ్వే బ్యాటర్లను వణికించాడు. మరో పేసర్ ప్రిన్స్ యాదవ్ (2/19) కూడా రాణించడంతో ఆతిథ్య జట్టు 32 పరుగులకే 4 కీలక వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఈ దశలో వెస్లీ మధెవెరె (39), తడివానశే మరుమాని (27 నాటౌట్) కాసేపు పోరాడినా స్కోరు బోర్డును వేగంగా ముందుకు నడిపించలేకపోయారు. దీంతో జింబాబ్వే నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 125 పరుగులు మాత్రమే చేయగలిగింది.




## యూఎస్ ఓపెన్ రన్నరప్ శ్రీకాంత్‌కు తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ అభినందనలు

హైదరాబాద్, జూలై 23: అమెరికాలోని కాలిఫోర్నియా వేదికగా ఇటీవల జరిగిన బీడబ్ల్యూఎఫ్ యూఎస్ ఓపెన్ సూపర్-300 బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో రన్నరప్‌గా నిలిచి భారత బ్యాడ్మింటన్‌కు మరోసారి అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకొచ్చిన స్టార్ షట్లర్ కిదాంబి శ్రీకాంత్ను తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ (శాట్స్+) మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ఏ. సోనీ బాలాదేవి అభినందించారు. ఈ సందర్భంగా శుక్రవారం హైదరాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియంలో శ్రీకాంత్ మర్యాదపూర్వకంగా డాక్టర్ సోనీ బాలాదేవిని కలిశారు. యూఎస్ ఓపెన్‌లో శ్రీకాంత్ కనబరిచిన అత్యుత్తమ ప్రదర్శనపై ఆమె హర్షం వ్యక్తం చేస్తూ ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. అంతర్జాతీయ వేదికపై భారత జెండాను రెపరెపలాడిస్తూ యువ క్రీడాకారులకు ఆదర్శంగా నిలుస్తున్న శ్రీకాంత్ భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ, తెలంగాణ ప్రభుత్వం, తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ అందిస్తున్న ప్రోత్సాహం క్రీడాకారులకు ఎంతో ఉత్సాహాన్నిస్తోందని పేర్కొన్నారు. భవిష్యత్ అంతర్జాతీయ టోర్నమెంట్‌లలో మరింత మెరుగైన ప్రదర్శన కనబరిచి దేశానికి మరిన్ని పతకాలు అందించేందుకు కృషి చేస్తానని తెలిపారు. ఇద్దరూ కొద్దిసేపు భారత బ్యాడ్మింటన్ అభివృద్ధి, యువ క్రీడాకారుల ప్రోత్సాహం, తెలంగాణలో క్రీడా మౌలిక సదుపాయాల విస్తరణ వంటి అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా అధికారులు, క్రీడా విభాగం ప్రతినిధులు పాల్గొన్నారు.

## అర్జెంటీనాపై తీవ్ర వ్యతిరేకత

ఫిఫా ప్రపంచకప్ 2026లో లియోనెల్ మెస్సీ నేతృత్వంలోని అర్జెంటీనా జట్టు ఫైనల్ వరకు దూసుకెళ్లినా, చివరకు స్పెయిన్ చేతిలో 0-1 తేడాతో ఓటమి పాలైంది. అయితే, ఈ ఓటమి కన్నా పెద్ద చర్చ ఆ జట్టు ప్రవర్తన, దానిపై వ్యక్తమైన ప్రపంచవ్యాప్త వ్యతిరేకత గురించే జరుగుతోంది. అందమైన ఆటతీరుతో అభిమానుల మనసు గెలుచుకోవడం పక్కన పెడితే, టోర్నమెంట్ ఆసాంతం వివాదాలతో, దూకుడు ప్రదర్శనతో అర్జెంటీనా చరిత్రలోనే అత్యంత ద్వేషించబడ్డ జట్టుగా నిలిచిందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. టోర్నీ జరుగుతున్న సమయంలోనే ఫిఫా.. అర్జెంటీనాకు అనుకూలంగా వ్యవహరిస్తోందన్న ఆరోపణలు బలంగా వినిపించాయి. ఈ నేపథ్యంలోనే 'అర్జెంటీనా అవుట్' పేరుతో ఒక ఆన్‌లైన్ పిటిషన్ ప్రారంభమైంది. "విజేత ఎవరో ముందే తెలిస్తే, మిగతా జట్లు టోర్నమెంట్‌లో ఎందుకు ఆడాలి? అర్జెంటీనాని ప్రపంచకప్ నుంచి




మినహాయించి అందరికీ సమాన అవకాశం ఇవ్వండి" అన్నది ఆ పిటిషన్ సారాంశం. అనూహ్యంగా ఈ పిటిషన్‌కు ప్రపంచవ్యాప్తంగా భారీ మద్దతు లభించింది. ఫైనల్ ముగిసే సమయానికి ఇది దాదాపు గిన్నిస్ వరల్డ్ రికార్డును బద్దలు కొట్టే స్థాయికి చేరుకుంది.

### అభినవ్ బింద్రా సైతం విద్యార్థుల వెంట...

ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద కాక్రోచ్ జనతా పార్టీ(జజీపీ) ఆధ్వర్యంలో విద్యార్థులు చేస్తున్న పోరాటానికి రోజురోజుకు మద్దతు పెరుగుతోంది. తాజాగా ఒలింపిక్ స్వర్ణ విజేత అభినవ్ బింద్రా సైతం విద్యార్థుల వెంట నిలిచారు. దేశంలో కొన్ని అంశాలకు మనం పట్టింపులు లేకుండా ఎలా మద్దతిస్తామో.. విద్యార్థుల సమస్యలకు జరుగుతున్న ఈ ఉద్యమానికి కూడా అండగా నిలవాలని పిలుపినిచ్చారు. నీట్ పేపర్ లీకేజీపై జవాబుదారీతనం కోరుతున్న కాక్రోచ్ జనతా పార్టీ ఉద్యమానికి ప్రజాదరణ పెరుగుతోంది. సామాజిక ఉద్యమకారులు, సినీ సెలబ్రిటీలే కాదు క్రీడా ప్రముఖులు కూడా 'మేమూ మీ వెంటే' అంటున్నారు. బీజింగ్ ఒలింపిక్స్‌లో పసిడి పతకంతో దేశం గర్వపడేలా చేసిన అభినవ్ బింద్రా కూడా విద్యార్థి ఉద్యమానికి మద్దతు పలికారు.



## చైనా ఓపెన్‌లో సింధుకు ఓటమి

**ఉత్కంఠ పోరులో చెన్ యుఫేయీ విజయం**

చైనా ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీలో భారత స్టార్ షట్లర్ పీవీ సింధు ప్రీక్వార్టర్ ఫైనల్లోనే నిష్క్రమించింది. గురువారం జరిగిన ఉత్కంఠభరిత పోరులో ప్రపంచ నాలుగో ర్యాంకర్, చైనా స్టార్ చెన్ యుఫేయీ 16-21, 22-20, 21-18తో సింధుపై విజయం సాధించింది. గంటా 29 నిమిషాల పాటు సాగిన ఈ మ్యాచ్‌లో చివరి వరకు ఇద్దరూ హోరాహోరీగా తలపడ్డారు. ఇటీవల జపాన్ ఓపెన్‌లో టైటిల్ గెలిచి మంచి జోష్‌లో ఉన్న సింధు తొలి గేమ్‌ను అద్భుతంగా కైవసం చేసుకుంది. రెండో గేమ్‌లోనూ విజయం అంచుల వరకు వెళ్లిన ఆమె నాలుగు మ్యాచ్ పాయింట్లను సద్వినియోగం చేసుకోలేకపోయింది. ఆ అవకాశాన్ని అందిపుచ్చుకున్న యుఫేయీ రెండో గేమ్‌ను గెలిచి మ్యాచ్‌ను నిర్ణయాత్మక మూడో గేమ్‌కు తీసుకెళ్లింది. మూడో గేమ్‌లోనూ ఇద్దరూ నువ్వా-నేనా అన్నట్లుగా పోరాడినా, చివర్లో యుఫేయీ కీలక పాయింట్లు సాధించి విజయాన్ని ఖాయం చేసుకుంది. దీంతో గతవారం జపాన్ ఓపెన్ సెమీఫైనల్లో ఎదురైన ఓటమికి యుఫేయీ ప్రతీకారం తీర్చుకున్నట్లైంది. ఈ ఓటమితో చైనా ఓపెన్‌లో సింధు పోరాటం ముగిసింది. అయితే మ్యాచ్ మొత్తం అత్యున్నత స్థాయి ర్యాలీలు, పోరాట స్ఫూర్తితో సాగి అభిమానులను .



# 'టాక్సిక్' పెద్దల సినిమా

కేజీఎఫ్ సిరీస్‌తో దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన రాక్ స్టార్ యశ్ నటిస్తున్న తాజా పాన్ ఇండియా చిత్రం 'టాక్సిక్: ఎ ఫెయిరీ టేల్ ఫర్ గ్రోన్ అప్స్' ఇప్పటికే భారీ అంచనాలను సొంతం చేసుకుంది. దర్శకురాలు గీతూ మోహన్‌దాస్ తెరకెక్కిస్తున్న ఈ చిత్రం ఆగస్టు 26న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల కానుంది. ఇటీవల విడుదలైన టీజర్, ప్రోమో వీడియోలు, పాటల్లో కనిపించిన బోల్డ్ కంటెంట్ సోషల్ మీడియాలో పెద్ద చర్చకు దారితీసింది. ఈ నేపథ్యంలో చిత్ర నిర్మాత కె. వెంకట నారాయణ తాజాగా ఇచ్చిన ఇంటర్వ్యూలో సినిమాపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. టాక్సిక్ సాధారణ కమర్షియల్ సినిమా కాదని, తాము ఇప్పటివరకు నిర్మించిన చిత్రాల కంటే పూర్తిగా భిన్నమైన కథాంశంతో రూపొందించామని ఆయన తెలిపారు. ప్రేక్షకులు థియేటర్లలో ఈ సినిమాను చూసిన తర్వాత తప్పకుండా కొత్త అనుభూతిని పొందుతారని, సినిమా ముగిసిన తర్వాత చిత్ర బృందాన్ని అభినందిస్తారనే పూర్తి నమ్మకం తనకు ఉందని పేర్కొన్నారు. అంతేకాకుండా, 'టాక్సిక్' ఒక కల్పిత కథ ఆధారంగా రూపొందిన సినిమా అని, ముఖ్యంగా పెద్దల కోసం రూపొందించిన ప్రత్యేక కథనమని ఆయన స్పష్టం చేశారు. సినిమా టైటిల్‌కు తగ్గట్టుగానే ఇందులో భావోద్వేగాలు, యాక్షన్, రొమాన్స్ ప్రేక్షకులను ఆకట్టుకునే అంశాలు ఉంటాయని సంకేతాలు ఇచ్చారు. ఇదిలా ఉంటే, ఇటీవల విడుదలైన 'మనసాగదే' పాటకు అద్భుతమైన స్పందన లభిస్తోంది. యశ్, తారా సుతారియా మధ్య సాగే ఈ రొమాంటిక్ ట్రాక్ సోషల్ మీడియాలో ట్రెండింగ్‌లో నిలిచింది. ముఖ్యంగా పాటలోని విజువల్స్, సంగీతం, ఇద్దరి కెమిస్ట్రీ ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నాయి. ఈ



# డబ్బు కోసం వ్యక్తిత్వాన్ని మార్చుకోను


టాలీవుడ్ స్టార్ హీరోయిన్ కాజల్ అగర్వాల్ మరోసారి తన వ్యక్తిగత అభిప్రాయాలను స్పష్టంగా వెల్లడించారు. సినిమాల్లో బికినీ, బోల్డ్ సన్నివేశాలు, రొమాంటిక్ సీన్స్‌పై ఇటీవల జరుగుతున్న చర్చల మధ్య ఆమె చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ముఖ్యంగా పెళ్లి తర్వాత హీరోయిన్లు గ్లామర్ పాత్రలు చేయడంపై వస్తున్న విమర్శల నేపథ్యంలో కాజల్ స్పందించిన తీరు అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. ప్రస్తుతం 'ది ఇండియా స్టోరీ' సినిమా ప్రమోషన్స్‌లో బిజీగా ఉన్న కాజల్ ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ, కెరీర్ ప్రారంభం నుంచే తాను బికినీ లేదా అతిగా బోల్డ్ సన్నివేశాల్లో నటించడానికి ఆసక్తి చూపలేదని తెలిపారు. అలాంటి పాత్రలు చేయడం తనకు వ్యక్తిగతంగా అసౌకర్యంగా అనిపిస్తుందని, అందుకే ఎన్నో భారీ చిత్రాలను కూడా వదులుకున్నానని వెల్లడించారు. సినిమాల కోసం లేదా డబ్బు కోసం నా వ్యక్తిత్వాన్ని మార్చుకోలేను. నాకు కొన్ని విలువలు, సిద్ధాంతాలు ఉన్నాయి.



# రణ్‌వీర్ 'ప్రళయ్'లో కళ్యాణి ప్రియదర్శన్

బాలీవుడ్ స్టార్ హీరో రణ్‌వీర్ సింగ్ నటిస్తున్న భారీ బడ్జెట్ చిత్రం 'ప్రళయ్'పై ఇప్పటికే సినీ వర్గాల్లో మంచి అంచనాలు నెలకొన్నాయి. యాక్షన్, ఎమోషన్స్ కలగలిపిన కథతో రూపొందుతున్న ఈ సినిమా గురించి వస్తున్న తాజా వార్త ఇప్పుడు మరింత ఆసక్తిని పెంచుతోంది. ఈ చిత్రంలో హీరోయిన్‌గా దక్షిణాది నటి కళ్యాణి ప్రియదర్శన్ ఎంపికైనట్లు సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. కళ్యాణి ప్రియదర్శన్ ఇప్పటికే తెలుగు, తమిళం, మలయాళ భాషల్లో పలు విజయవంతమైన చిత్రాల్లో నటించి మంచి గుర్తింపు సంపాదించారు. సహజమైన నటన, అందంతో యువతలో ప్రత్యేకమైన ఫాలోయింగ్ ఏర్పరచుకున్న ఆమెకు ఇప్పుడు బాలీవుడ్‌లో భారీ అవకాశం దక్కబోతుందనే వార్త చర్చనీయాంశంగా మారింది. రణ్‌వీర్ సింగ్ వంటి స్టార్ హీరో సరసన నటించే అవకాశం రావడం ఆమె కెరీర్‌లో కీలక మలుపుగా భావిస్తున్నారు. రణ్‌వీర్ సింగ్ తన ఎనర్జిటిక్ స్క్రీన్ ప్రెజెన్స్, విభిన్న పాత్రలతో ప్రేక్షకులను అలరిస్తూ వస్తున్నారు. అలాంటి హీరోతో కళ్యాణి జోడీ కట్టడం సినిమాపై మరింత ఆసక్తిని రేకెత్తిస్తోంది. ఈ ఇద్దరి మధ్య కెమిస్ట్రీ ఎలా ఉంటుందో తెలుసుకోవాలని అభిమానులు ఎదురుచూస్తున్నారు. ముఖ్యంగా దక్షిణాది ప్రేక్షకుల్లో కూడా ఈ కాంబినేషన్‌పై చర్చ మొదలైంది. 'ప్రళయ్' చిత్రాన్ని భారీ స్థాయిలో తెరకెక్కిస్తున్నట్లు సమాచారం. యాక్షన్ సీక్వెన్సులతో పాటు భావోద్వేగాలకు కూడా ప్రాధాన్యత ఇచ్చే కథగా రూపొందుతోందని సినీ వర్గాలు చెబుతున్నాయి. అంతర్జాతీయ స్థాయి సాంకేతిక ప్రమాణాలతో సినిమాను రూపొందించేందుకు మేకర్స్ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం కళ్యాణి ప్రియదర్శన్ ఎంపికపై అధికారిక ప్రకటన రాకపోయినా, త్వరలోనే చిత్రబృందం పూర్తి తారాగణాన్ని ప్రకటించే అవకాశం ఉందని సమాచారం. తదుపరి షూటింగ్ షెడ్యూల్ కూడా త్వరలో ప్రారంభం కానున్నట్లు తెలుస్తోంది. మొత్తానికి రణ్‌వీర్ సింగ్ – కళ్యాణి ప్రియదర్శన్ కాంబినేషన్ నిజమైతే, ఇది దక్షిణాది – బాలీవుడ్ కలయికలో మరో ఆసక్తికర జోడీగా నిలిచే అవకాశముందని సినీ విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ కొత్త జంట వెండితెరపై ఎలాంటి మ్యాజిక్ చేస్తుందో చూడాలంటే అధికారిక ప్రకటనతో పాటు సినిమా విడుదల వరకు

# విద్యార్థుల పోరాట పటిమ గొప్పది



దేశవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తున్న 'నీట్' పేపర్ లీక్ కుంభకోణం, తర్వాత పరిణామాలపై ప్రముఖ నటి నోరా ఫతేహి తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థుల ఆత్మహత్యలు తనను ఎంతగానో కలచివేశాయని చెబుతూ, వారి పోరాట పటిమను ఆమె ప్రశంసించారు. ఢిల్లీలో 'కాక్రోచ్ జనతా పార్టీ' ఆధ్వర్యంలో జరిగిన 'ఛలో సంసద్' మార్చ్‌పై పోలీసులు లాఠీఛార్జ్ చేసిన నేపథ్యంలో, ఆమె ఇన్‌స్టాగ్రామ్ వేదికగా విద్యార్థులకు అండగా నిలుస్తూ ఒక భావోద్వేగ సందేశాన్ని పంచుకున్నారు. 'బాధలో ఉన్న ప్రతి విద్యార్థికి, వారి కుటుంబాలకు నా హృదయపూర్వక మద్దతు ఉంటుంది. విద్య అంటే కేవలం మార్కులు కాదు.. అదొక ఆశ, ఒక స్వప్నం. పేపర్ లీక్ వార్తలు యువతను తీవ్ర నిరాశకు గురి చేశాయి. విద్యార్థుల ఆత్మహత్యల వార్తలు నన్ను కుదిపేశాయి. ఏ పరీక్ష లేదా ఏ వ్యవస్థ కూడా ఒక యువ ప్రాణాన్ని బలిగొనేలా ఉండకూడదు. పిల్లల్ని కోల్పోయిన కుటుంబాల బాధ వర్ణనాతీతం' అని నోరా ఆవేదన వ్యక్తం చేశారు. భారతీయ విద్యార్థుల ధైర్యం, పట్టుదల చూసి తాను ఆశ్చర్యపోయానని, తన ప్లాట్‌ఫారమ్ ద్వారా వారికి మద్దతు తెలపాలని నిర్ణయించుకున్నట్లు ఆమె క్యాప్షన్‌లో పేర్కొన్నారు.

# ఇళ్లకు వెళ్లిపోండి: సల్మాన్ ఖాన్



దిశ, వెబ్‌డెస్క్: దేశవ్యాప్తంగా కలకలం రేపుతున్న పేపర్ లీకేజీ అంశం, తదనంతర ఆందోళనలపై బాలీవుడ్ సూపర్‌స్టార్ సల్మాన్ ఖాన్ మరోసారి స్పందించారు. తొలుత విద్యార్థుల నిరసనలకు సపోర్ట్ చేసిన సల్మాన్.. ఇప్పుడు ఇళ్లకు వెళ్లిపోండంటూ ఎక్స్ లో పోస్టు పెట్టారు. విద్యార్థుల భవిష్యత్తు, వారి భద్రతే ఈ ప్రభుత్వానికి మొదటి ప్రాధాన్యం అని పేర్కొన్న ఆయన, ఆందోళనలు విరమించి ఇళ్లకు తిరిగి వెళ్లాలని విద్యార్థులకు, నిరసనకారులకు విజ్ఞప్తి చేశారు. 'విద్యార్థుల చదువు, వారి రక్షణే అత్యంత ముఖ్యం. కాబట్టి విద్యార్థులు గానీ, వారి తల్లిదండ్రులు గానీ ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. ఈ అంశంపై గౌరవనీయులైన ప్రధానమంత్రి ఇప్పటికే స్పందిస్తూ ట్వీట్ చేశారు. లీకేజీకి బాధ్యులైన ప్రతి ఒక్కరిపైనా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటుందని నేను గట్టిగా నమ్ముతున్నాను. అందుకే విద్యార్థులంతా దయచేసి తమ ఇళ్లకు, తల్లిదండ్రుల వద్దకు చేరుకోవాలి' అని కోరారు. అలాగే నిరాహార దీక్ష చేస్తున్న సోనమ్ వాంగ్ చుక్ కు ఆయన స్పెషల్ రిక్వెస్ట్ చేశారు.

# ప్రెగ్నెన్సీ కోసం 1000 ఇంజెక్షన్లు



సినీ నటి, మోడల్ తేజస్విని కోల్హాపురి.. తాజాగా ఓ పోడ్‌కాస్ట్‌కు ఇంటర్వ్యూ ఇచ్చింది. ప్రెగ్నెన్సీ కోసం ఐవీఎఫ్ చేయించుకున్న తీరు గురించి ఆమె హృదయవిదారకర పరిస్థితిని వివరించింది. సిద్ధార్థ కన్నన్‌తో జరిగిన పోడ్‌కాస్ట్‌లో ఆమె మాట్లాడుతూ.. ఐవీఎఫ్ పద్ధతిలో పిల్లలు కనేందుకు చాలా ఇబ్బందిపడినట్లు చెప్పింది. ఒకప్పటి సినీ నటి పద్మిని కొల్హాపురి సోదరియే తేజస్విని. బాలీవుడ్ నటులు శ్రద్ధా కపూర్, సిద్ధాంత్ కపూర్‌లకు వరుసకు మేనత్త అవుతుంది. అయితే ఐవీఎఫ్ విధానం వల్ల తీవ్రమైన మానసిక, శారీరక బాధను అనుభవించాల్సి వచ్చినట్లు చెప్పిందామె. తన జీవితంలో అదో సంక్లిష్టమైన దశ అని ఆమె తెలిపారు. అయిదు సార్లు ఐవీఎఫ్ చేయించుకున్నట్లు తేజస్విని చెప్పింది . దీని గురించి ఓపెన్‌గానే మాట్లాడుతాను. ఐవీఎఫ్ పద్ధతి చాలా కష్టమైందన్నారు. మొదటిసారి, రెండోసారి సమస్య తీవ్రంగా ఉంటుందని, ఇక ఆ తర్వాత మూడు, నాలుగు, అయిదోసారి పర్వాలేదనిపిస్తుందన్నారు. మానసికంగా చాలా ధైర్యంగా ఉండాలని, ఇంజెక్షన్ల కోసం ప్రతిసారి క్లినిక్‌లకు వెళ్లాల్సి వస్తుందన్నారు. చాలా నొప్పిని తట్టుకోవాల్సి వస్తుందన్నారు. చాలా ఆలస్యంగా పిల్లలు కనాలని అనుకున్నానని, కానీ 35 ఏళ్ల లోపే పిల్లల్ని కనాలని సలహా ఇస్తున్నట్లు ఆమె చెప్పారు.

"This newspaper/periodical is published by KALIDINDI SUMALATHA from 1-7-750/1-3, F 103, SRUTHI SADAN APTS ST PIOUS SCHOOL ROAD, RAMNAGAR, HYDERABAD, TELANGANA - 500020. on behalf of **RS USAR PUBLICATIONS**, edited by RAGHURAMA RAJU KALIDINDI and printed by **KALIDINDI SUMALATHA** at **KING DIGITAL OFFSET PRINTERS**, 1-7-750/1-3, F 103, SRUTHI SADAN APTS ST PIOUS SCHOOL ROAD, RAMNAGAR, HYDERABAD, TELANGANA – 500020. **PRGI NO: TGTEL/26/A2948,** Email: rsusarp@myyahoo.com, 9849350555, 9515121467